ఐఐఎస్‌సి ప్రతిష్టను దెబ్బతీయొద్దు

- ఉపాపై చర్చ రద్దును నిరసిస్తూ 500 మందికి పైగా శాస్త్రవేత్తలు, విద్యా ప్రముఖుల లేఖ

● లోపలి పేజీలో.. ●

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 333 | విజయవాడ, మంగళవారం 4 జులై 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 4 July 2023 | Rs

నేడు మహాధర్నా

గన్నవరం నుంచి ముస్తాబాద వస్తున్న మహా పాదయాత్ర

● లోపలి పేజీలో.. ●

పచ్చజెండా ఊపి 108 అంబులెన్సులను ప్రారంభిస్తున్న సిఎం జగన్

కొత్తగా కొనుగోలు చేసిన 108 అంబులెన్సులు

108 అంబులెన్సులకు సిఎం పచ్చజెండా

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

108 సేవలకు ఉపయోగించే అంబులెన్స్‌లను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. అత్యవసర వైద్య సేవలకు వినియోగించేందుకు 146 అంబులెన్సులను రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా కొనుగోలు చేసింది. వీటిని తాడేపల్లిలోని తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన వేదిక నుంచి పచ్చజెండా ఊపి ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన వీటిలోని వైద్య పరికరాలను, సౌకర్యాలను పరిశీలించారు.

రాష్ట్రంలో 108 అంబులెన్స్ సేవలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా గతంలో ఉన్న 108 వాహనాల్లో పాడైన వాటి స్థానంలో కొత్త వాటిని కొనుగోలు చేసింది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రులు విడదల రజిని, కె.వి.ఉషశ్రీ చరణ్, దాడిశెట్టి రాజా, బాపట్ల ఎంపి నందిగం సురేష్, శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, శాసనమండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, కల్పలతా రెడ్డి, రాష్ట్ర, వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ సిఎస్ ఎంటి.కృష్ణబాబు, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మద్దాళి గిరిధర్, మహమ్మద్ ముస్తాఫా, అన్నా బత్తుని శివకుమార్, నగరపాలక సంస్థ మేయర్ కావటి శివనాగ మనోహరనాయుడు తదితరులు హాజరయ్యారు.

15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించాలని

పంచాయతీరాజ్ కార్యాలయం ముట్టడి

రోడ్డుపై సర్పంచుల ఆందోళన, అరెస్టు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ పంచాయతీలకు కేంద్రం 15వ ఆర్థిక సంఘం కింద విడుదల చేసిన రూ.988 కోట్లలో గ్రామ పంచాయతీలకు రావాల్సిన రూ.691 కోట్లను తక్షణమే పిఎఫ్ఎంఎస్ ద్వారా బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాలయాన్ని గ్రామ సర్పంచులు సోమవారం ముట్టడించారు. రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. కార్యాలయం ప్రధాన గేటు వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో కొద్దిసేపు ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే సందర్భంలో పోలీసులు సర్పంచులను విచక్షణారహితంగా లాగి పడేసి బలవంతంగా వ్యానుల్లోకి ఎక్కించారు. అనంతరం పెదకాకాని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలకలపూడి పాపారావు, రాష్ట్ర కార్యదర్శి టి కృష్ణమోహన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి సరోజిని, ఎపి పంచాయతీ పరిషత్తు ఛైర్మన్ జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులను గత రెండేళ్లుగా బదిలీ చేయలేదని, తక్షణమే బదిలీ చేయాలని, గ్రామ పంచాయతీ సర్పంచుల ఆధీనంలోనే గ్రామ సచివాలయాల కార్యకలాపాలు జరపాలని, వలంటీర్లు, సిబ్బందిని సర్పంచుల ఆధీనంలో ఉంచాలని డిమాండ్ చేశారు. సర్పంచుల గౌరవ వేతనం రూ.3 వేల నుంచి రూ.15 వేలకు పెంచాలని, మైనర్ పంచాయతీ కరెంట్ బిల్లులు, తాగునీటి సరఫరాకు, వీధిలైట్లకు ఖర్చును పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, ఉచితంగా కరెంటు ఇవ్వాలని, గ్రామ పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్ జీతాలు రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనరు సూర్యకుమారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. వారం రోజుల్లో విద్యుత్ బిల్లులు కట్ చేసి మిగిలిన నగదును అకౌంట్లలో జమ చేస్తామని కమిషనరు తమకు చెప్పినట్లు సంఘం నేతలు మీడియాకు వెల్లడించారు. విద్యుత్ బిల్లుల పేరుతో ఆర్థిక సంఘం నిధులు కట్ చేస్తే రాష్ట్రవ్యాప్తంగా మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని సర్పంచులు పేర్కొన్నారు. సర్పంచుల పోరాటానికి సిపిఐ సీనియర్ నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు సంఘీభావం తెలిపారు. ఈ ముట్టడి కార్యక్రమంలో అఖిల భారత పంచాయతీ పరిషత్తు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు అప్పిరెడ్డి, అల్లాబక్షు, ధర్మరాజు, రమేష్‌రెడ్డి, సర్పంచుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

సర్పంచులను అరెస్టు చేయడం అన్యాయం

రాష్ట్ర ప్రభుత్వం వాడుకున్న ఆర్థిక సంఘం నిధులను సర్పంచుల ఖాతాల్లో జమ చేయాలనే డిమాండ్‌తో సర్పంచుల సంక్షేమ సంఘం ఆందోళనకు సిపిఎం రాష్ట్ర కమిటీ పూర్తి మద్దతు తెలుపుతోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సర్పంచులను అరెస్టు చేయడం అన్యాయమని, విజయవాడకు రాకుండా ఎక్కడికక్కడ జిల్లాల్లో ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని, సర్పంచుల డిమాండ్స్‌ను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

అరెస్టు చేయడం దుర్మార్గం

తమకు రావాల్సిన నిధులివ్వాలని కోరితే సర్పంచులను అరెస్టు చేయడం అత్యంత దారుణమని, అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవిబి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. కేంద్రం విడుదల చేసిన మొత్తం నిధులు రూ.12,690 కోట్లను సర్పంచుల ఖాతాల్లో జమ చేసేంత వరకు పోరాటం కొనసాగుతుందన్నారు.

- వైవిబి రాజేంద్ర ప్రసాద్

పునర్వ్యవస్థీకరణపై చర్చ..!

మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

- కేంద్ర మంత్రివర్గం భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై సర్వత్రా చర్చ నెలకొంది. సోమవారం నాడిక్కడ ప్రగతి మైదాన్‌లో కొత్తగా నిర్మించిన కన్వెన్షన్ సెంటర్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రి మండలి సమావేశం జరిగింది. ఇది త్వరలో జరగనున్న మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ గురించి ఊహాగానాలకు దారితీసింది. కీలకమైన విషయాలపై చర్చించేందుకు బిజెపి అగ్రనాయకత్వం పలు దఫాల సమావేశాల అనంతరం కేంద్ర మంత్రి మండలి పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. పార్టీ సంస్థాగత, రాజకీయ వ్యవహారాల పరిస్థితిని నిశితంగా అంచనా వేయడానికి ప్రధాని మోడీ జూన్ 28న కీలకమైన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మంత్రి మండలిలో మార్పులు చేర్పులు జరుగుతాయని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, మిజోరాం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మంత్రివర్గ విస్తరణ జరగనుంది. సమావేశం అనంతరం మంత్రిమండలితో ఫలవంతమైన సమావేశం జరిగిందని, తాము వివిధ విధాన సంబంధిత అంశాలపై అభిప్రాయాలను వ్యక్తం చేశామని ప్రధాని మోడీ ట్వీట్ చేశారు.

హైదరాబాద్ నిమ్స్‌లో రోబోటిక్ సర్జికల్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ సర్జికల్ సిస్టమ్‌ను వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే మొట్టమొదటిసారిగా ప్రభుత్వాస్పత్రుల్లో రోబోటిక్ సర్జరీలు చేయడం నిమ్స్‌లోనే తొలిసారని చెప్పారు. కొత్త ఎక్విప్‌మెంట్ కోసం రూ.150 కోట్లను ప్రభుత్వం గ్రాంట్ రూపంలో విడుదల చేసిందని తెలిపారు. రోబోటిక్ యంత్రం వల్ల పేదలకు మంచి వైద్యం అందడమే కాకుండా వైద్యులకు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. దేశంలోనే అతి పెద్ద డయాగ్నస్టిక్ సెంటర్ నిమ్స్‌లో ఉందని చెప్పారు. ఇటీవల ముఖ్యమంత్రి కెసిఆర్ శంకుస్థాపన చేసిన రెండు వేల పడకల ఆస్పత్రి భవనం పనులు త్వరలో ప్రారంభం కానున్నాయన్నారు. హైదరాబాద్ నగరంలో ముఖ్యంగా ఆరోగ్య సంస్థలో పనిచేయడానికి ఆల్ ఇండియా టాప్ ర్యాంకర్స్ నిమ్స్‌లో చదవడానికి గల కారణం మన దగ్గర ఉన్న నాణ్యత, ప్రభుత్వం అందిస్తున్న పరికరాల విధానం అని తెలిపారు.

రాంగ్ సిగ్నలింగ్ వల్లే ఒడిషా రైలు దుర్ఘటన

- విచారణ కమిటీ వెల్లడి

న్యూఢిల్లీ: ఒడిషాలో గత నెలలో జరిగిన రైలు దుర్ఘటనకు గల కారణాలను విచారణ కమిటీ వెల్లడించింది. రాంగ్ సిగ్నలింగ్ వల్లే ఈ ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుందని తేల్చింది. దీంతోపాటు అనేక స్థాయిల్లో లోపాలు ఉన్నట్టు గుర్తించిన రైల్వే సేఫ్టీ కమిషన్.. తన దర్యాప్తు నివేదికను రైల్వే బోర్డుకు సమర్పించింది. గతంలో ఇదే తరహాలో జరిగిన పొరపాట్ల నుంచి పాఠాలు నేర్చుకొని ఉంటే ఈ రైలు ప్రమాదం తప్పేదని అభిప్రాయపడింది. రాంగ్ వైరింగ్, రాంగ్ కేబుల్ వల్ల 2022 మే 16న ఇదే తరహా దుర్ఘటన ఖరగ్‌పూర్ డివిజన్‌లో చోటుచేసుకుందని నివేదిక తెలిపింది. అప్పుడే దాన్ని సరిచేసే చర్యలు చేపట్టి రాంగ్ వైరింగ్ సమస్యను పరిష్కరించిఉంటే ఒడిశాలోని బహనాగా బజార్ వద్ద ఈ రైలు దుర్ఘటన చోటుచేసుకొని ఉండేది కాదని తెలిపింది. సిగ్నలింగ్, సర్క్యూట్ మార్పులో లోపాలే ఈ ప్రమాదానికి కారణమని తేల్చింది. ఒడిషాలోని బాలేశ్వర్‌లో జూన్ 2న రాత్రి కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ సహా మూడు రైళు అనూహ్య రీతిలో ఢీకొన్న ఘటన దేశ వ్యాప్తంగా పెను విషాదం నింపిన సంగతి తెలిసిందే. రైలు దుర్ఘటనలో 292మంది ప్రాణాలు కోల్పోగా 1000 మందికి పైగా గాయపడ్డారు. యావత్ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిన ఈ ఘటనపై కుట్ర కోణం ఆరోపణలు రావడంతో రైల్వే బోర్డు సిఫారసు మేరకు రంగంలోకి దిగిన కేంద్ర దర్యాప్తు సంస్థ దర్యాప్తు కొనసాగిస్తోంది. అయితే, తొలుత రైల్వే సేఫ్టీ కమిషన్ విచారణ జరపడంతో ఆ కమిటీ విచారణను పూర్తి చేసి నివేదికను రైల్వే బోర్డుకు తాజాగా సమర్పించింది.

నిర్వాసితులకు నిధులు రాబట్టండి

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపించండి

ప్రధాని నుంచి హామీ పొందాలంటూ ముఖ్యమంత్రికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ప్రధాన మంత్రితో చర్చించి, ఒత్తిడి తెచ్చయినా పరిష్కారానికి పూనుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సోమవారం లేఖ రాశారు. పోలవరం నిర్వాసితులు, గిరిజనులు సుమారు 500 మందితో కలిసి గత 14 రోజులుగా పాదయాత్ర చేస్తున్నానని తెలిపారు. ఆయా సమస్యల్ని ఎప్పటికప్పుడు సిఎం దృష్టికి ఈపాటికే నిర్దిష్టంగా ఉత్తరాల ద్వారా తెచ్చానని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంత మండలాలైన దేవీపట్నం, చింతూరు, వి.ఆర్.పురం, కూనవరం, ఎటపాక, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడులో పాదయాత్ర సాగిందని వివరించారు. నిర్వాసితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన ప్యాకేజీలు ఏవీ అమలు కాలేదని, కేవలం 10-15 శాతం మందికి మాత్రమే అరకొరగా అందజేశారని తెలిపారు. 41.5 మీటర్ల వద్ద 20 గ్రామాలు 20 వేల మందిని నిర్వాసితులుగా తేల్చారు కానీ గతేడాది వరదల్లో 40 మీటర్లకు 193 గ్రామాలు మునిగాయని, కాంటూరు లెక్కలన్నీ తప్పుడు లెక్కలే అని పేర్కొన్నారు. 1986, 2022 వరదల ఆధారంగా రీసర్వే జరపాలని కోరారు. గతేడాది వరద వచ్చినప్పుడు ఇవ్వాల్సిన నష్టపరిహారం ఇంకా పూర్తిగా అందలేదని తెలిపారు. ఈ ఏడాది వరద వచ్చే అవకాశాలున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రాజెక్టు ఆనుకుని ఉన్న ప్రాంతాల నుండి బలవంతంగా నిర్వాసితులను తరలించారని, ఆ నిర్వాసితుల కాలనీల్లో ఎటువంటి ప్రాథమిక సౌకర్యాలు లేవని, ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారని వివరించారు. సంక్షేమ కార్యక్రమాలు అమలు జరగడం లేదని, అందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వీటికి అవసరమైన నిధులు కేంద్ర ప్రభుత్వం నుండి రాబట్టడానికి ఒత్తిడి తెచ్చి సాధిస్తారని ఆశించారు. నిర్వాసిత ప్రజలకు సిఎం ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని కోరారు.

రాష్ట్రంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎన్ని ఆందోళనలు జరుగుతున్నా, బిజెపి తప్ప అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలు వ్యతిరేకిస్తున్నా, అసెంబ్లీలో తీర్మానం చేసినా కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణపై ఏమాత్రం తగ్గడం లేదని వివరించారు. విశాఖ ఉక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని సూచించారు. కేంద్రం స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి అవసరమైన మైన్స్ కేటాయించకుండా ఇబ్బందులకు గురిచేస్తుందని, మైన్స్‌ను కేటాయించేట్లు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. అదే సందర్భంలో రాష్ట్రంలో కేటాయించిన గనుల లీజు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించాలని తెలిపారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపి ప్రభుత్వ రంగంలోనే కొనసాగించడానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడిపించి లాభాల్లోకి వచ్చేట్లు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని సూచించారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రధాన మంత్రితో చర్చించి నిర్దిష్ట హామీ తీసుకోవాలని శ్రీనివాసరావు కోరారు.

సాహితి ఫార్మా పేలుడు క్షతగాత్రుల్లో..

మరో ఇద్దరు మృతి

నష్ట పరిహారం కోసం సిఐటియు ఆందోళన

రూ.34 లక్షల చొప్పున ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకారం

అప్పారావు

రామేశ్వర్

ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు, మృతుల కుటుంబీకులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్, రాంబిల్లి విలేకరులు

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని సాహితి ఫార్మాలో గత నెల 30న జరిగిన భారీ పేలుడులో గాయపడి చికిత్స పొందుతున్న ఐదుగురిలో మరో ఇద్దరు మృతి చెందారు. దీంతో, ప్రమాద మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. పేలుడు సంభవించిన కొద్దిసేపటికే గత శుక్రవారం ఇద్దరు కార్మికులు మృతి చెందారు. తాజాగా ఆదివారం రాత్రి అనకాపల్లి జిల్లా నక్కపల్లికి చెందిన సమ్మంగి అప్పారావు, సోమవారం ఉదయం ఒడిశాకు చెందిన రామేశ్వర్ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చనిపోయారు. కార్మికులు మృతి చెందిన విషయం తెలిసి సిఐటియు అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. తొలుత వారి మృతదేహాల వద్ద నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం గత శనివారం జరిగిన చర్చల్లో సాహితి ఫార్మా కంపెనీ అంగీకరించిన విధంగా అప్పారావు, రామేశ్వర్ కుటుంబాలకూ రూ.34 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలంటూ ఆస్పత్రి వద్ద సిఐటియు నేతలు, మృతుల కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. పరిశ్రమ యాజమాన్యం పోస్టుమార్టం చేసిన తర్వాత పరిహారంపై మాట్లాడదామని చెప్పింది. దీనికి వారు అంగీకరించలేదు. తుదకు రూ.34 లక్షలు చొప్పున చెల్లిస్తానని యాజమాన్యం అంగీకరించడంతో ఆందోళన విరమించారు.

జెనిన్‌పై ఇజ్రాయిల్ దాడి

- తొమ్మిది మంది పాలస్తీనియన్ల మృతి
- ఐరాస సహా పలు దేశాల ఖండన
- మరో 25 ఎఫ్-35 విమానాలు కొనుగోలు చేసిన ఇజ్రాయిల్

జెరూసలేం : ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని జెనిన్‌పై సోమవారం తెల్లవారు జామున యూదు దురహంకార ఇజ్రాయిల్ దాడి చేసింది. మిలటరీ డ్రోన్‌లు, బలగాలతో జరిపిన ఈ దాడిలో తొమ్మిదిమంది పాలస్తీనియన్లు మరణించారని. పలువురు గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఆ ప్రాంతమంతా వేలాది బలగాలను ఇజ్రాయిల్ మోహరించింది. సోమవారం సాయంత్రానికి కూడా జెనిన్‌పై దాడులు కొనసాగుతూనే ఉన్నాయని స్థానిక మీడియా తెలిపింది. మరిన్ని బలగాలను, వాహనాలను ఇజ్రాయిల్ ఆర్మీ శిబిరంలోకి పంపిస్తోందని మీడియా వార్తలు తెలిపాయి. రద్దీగా వున్న పాలస్తీనీయుల వీధుల్లో నుండి నల్లటి దట్టమైన పొగ పైకి లేవడం కనిపిస్తోంది. తుపాకుల శబ్దాలు వినిపిస్తున్నాయి. పై నుండి డ్రోన్‌ల శబ్దాలు కూడా వినపడుతున్నాయి. కొన్ని చోట్ల విద్యుత్‌ను నిలుపుచేశారని అక్కడి ప్రజలు తెలిపారు. శిబిరంలో పిల్లలు భయంతో వణికిపోతూ ఏడుస్తున్నారని తెలిపారు. ఇజ్రాయిలీ బలగాలకు దారిని క్లియర్ చేయడం కోసం ఇరుకుగా వుండే ఆ వీధుల్లో మిలటరీ బుల్డోజర్లు భవనాలను ధ్వంసం చేస్తున్నాయి.

పలు దేశాల ఖండన

పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ దాష్టీకాన్ని ఐక్యరాజ్య సమితితో సహా పలు దేశాలు తీవ్రంగా ఖండించాయి. భారత్ మాత్రం మౌనం వహించింది. ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ గాజా నగర సెంటర్‌లో పాలస్తీనీయులు ప్రదర్శన నిర్వహించారు. జెనిన్ ప్రజలకు సంఘీభావం తెలిపారు. తక్షణమే ఇజ్రాయిల్ దుందుడుకుచర్యను నిలువరించాలని నినాదాలు చేశారు. 'ప్రతిఘటనకు సాయమందిస్తాం, జెనిన్‌వాసులకు బాసటగా వుంటామని రాసిన బ్యానర్లను ప్రదర్శించారు. ఈ మిలటరీ ఆపరేషన్‌ను అంతమొందించడానికి తక్షణమే అంతర్జాతీయ

మిగతా 5లో

17, 18 తేదీల్లో బెంగళూరులో ప్రతిపక్షాల భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్షాల సమావేశం బెంగళూర్ వేదికగా ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేత కెసి వేణుగోపాల్ ట్వీట్ చేశారు. గత నెల 23న పాట్నాలో ప్రతిపక్షాల తొలి భేటీ జరిగిన సంగతి తెలిసిందే. ఆ సమావేశంలోనే సిమ్లాలో తదుపరి భేటీ నిర్వహించాలని నిర్ణయించారు. అక్కడ వర్షాలు ఎక్కువగా ఉన్నందున బెంగళూరుకు వేదికను మార్చి, ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎన్‌సిపి నేత శరద్ పవార్ మూడు రోజుల క్రితం వెల్లడించారు. బీహార్, కర్ణాటకలో ఆ సమయంలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున తమకు వీలుపడకపోవచ్చని నితీశ్, సిద్ధరామయ్య చెప్పడంతో ఈ రెండో విడత సమావేశాన్ని ఈ నెల 17, 18 తేదీలకు మార్చాల్సి వచ్చిందని కాంగ్రెస్ సీనియర్ నేత కెసి వేణుగోపాల్ తెలిపారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి)లో చీలిక ప్రభావం ఈ సమావేశంపై ఉండదని ప్రతిపక్ష పార్టీల నేతలు తెలిపారు. పార్లమెంటు సమావేశాలు జులై 20న ప్రారంభం కానున్నాయి. బీహార్ అసెంబ్లీ సమావేశాలు జులై 10 నుంచి 24 వరకు జరగనున్నాయి. కర్ణాటక అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుండి మొదలయ్యాయి. ఈ నెల 14వరకు ఇవి కొనసాగే అవకాశముంది. బెంగళూరులో జరిగే ప్రతిపక్షాల సమావేశ తేదీల్లో మార్పులు వేయాలని మల్లికార్జున ఖర్గే నితీష్ కుమార్‌ను కోరడంతో ఆయన ఈ మార్పులు చేశారని సంబంధిత వర్గాలు తెలిపాయి.

తరువాతి ఏడాదిలో వినియోగిస్తున్నాం

- జెవికె కిట్లపై సమగ్రశిక్షా వివరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగనన్న విద్యాకానుక (జెవికె)లో మిగిలిన కిట్లను తర్వాతి సంవత్సరంలో వినియోగిస్తున్నామని సమగ్రశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఎ) తెలిపింది. 'ఆ 9.28 లక్షల జెవికె కిట్లు ఏవీ?' పేరుతో ప్రజాశక్తి సోమవారం ప్రచురించిన కథనంపై ఎస్ఎస్ఎ వివరణ ఇచ్చింది. కథనంలో చూపిన అంకెలు అడ్మినిస్ట్రేటివ్ మంజూరుకు సంబంధించినవని పేర్కొంది. 2021-22 విద్యాసంవత్సరంలో 43,00,238 కిట్లకే సప్లయి ఆర్డర్ ఇచ్చామని తెలిపింది. 2022-23లో అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ 47,88,043 ఇచ్చినప్పటికీ సప్లయ్ ఆర్డర్ 45,60,041 మాత్రమే ఇచ్చామని వివరించింది. 2022-23లో మిగిలిన 6,65,324 నోటు పుస్తకాలు, 1,49,568 బెల్టులు ప్రస్తుత సంవత్సరం ఉపయోగిస్తున్నామని తెలిపింది. డిక్షనరీలను కొత్తగా చేరినవారికి, డిక్షనరీలు పోగొట్టుకున్న విద్యార్థులకు సరఫరా చేశామని పేర్కొంది. 2023-24 విద్యాసంవత్సరంలో 43,10,165 మంజూరు చేసినప్పటికీ సప్లయ్ ఆర్డర్ కచ్చితమైన ఎన్‌రోల్‌మెంట్ ప్రకారం మాత్రమే ఇచ్చామని తెలిపింది. 'ఆ 9.28 లక్షల జెవికె కిట్లు ఏవీ?' కథనంలోని పేర్కొన్న సమచారాన్ని సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) ఆర్‌సి నెంబరు ఎస్‌పిఎల్/ఎపి/సిఎంవో-1/ఎ6/2023 లేఖ ఆధారంగా ఎస్ఎస్ఎ ఇచ్చిన డేటాను మాత్రమే ప్రజాశక్తి పొందుపరిచింది. అయినా 'నిరాధార, అవాస్తవాలు' అని పేర్కొనడం గమనార్హం.

హైకోర్టుకు అధికారులు

- జిఓ 121 ఉపసంహరించుకున్నట్లు వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి

కోర్టు ధిక్కార కేసులో జిఎడి ముఖ్య కార్యదర్శి రేవు ముత్యాలరాజు, జిఎడి కార్యదర్శి పోలా భాస్కర్ వ్యక్తిగతంగా సోమవారం హైకోర్టుకు హాజరయ్యారు. సచివాలయంలో సెక్షన్ ఆఫీసర్లకు అసిస్టెంట్ సెక్రటరీలుగా తాత్కాలిక ప్రమోషన్లకు గత జనవరిలో ఇచ్చిన జిఓ 121ను వాపస్ తీసుకుంటున్నట్లు వాళ్ల తరపున న్యాయవాది చెప్పారు. ఇదే అంశంపై దాఖలైన కేసు సింగిల్ జడ్జి వద్ద విచారణకు వచ్చింది. అన్ని కేసుల్ని ఒక కోర్టులో వచ్చేలా చేయాలని కోరారు. ఈ కేసులను తాత్కాలిక సిజె వద్ద ఉంచాలని రిజిస్ట్రీకి జస్టిస్ జి రామకృష్ణ ప్రసాద్ ఆదేశించారు. మెరిట్ లిస్ట్ ఆధారంగా కాకుండా ఉద్యోగంలో చేరిన తేదీ ఆధారంగా ప్రమోషన్స్ కల్పిస్తున్నారంటూ పలువురు వేసిన పిటిషన్లను విచారించిన హైకోర్టు.. మెరిట్ లిస్ట్ ఆధారంగా ఉద్యోగోన్నతులు కల్పించాలంది. ఇందుకు విరుద్ధంగా జిఓ 121 జారీ అయ్యిందని దాఖలైన కోర్టుధిక్కార కేసులో వారిద్దరూ వ్యక్తిగతంగా హాజరయ్యారు. తదుపరి విచారణ నుంచి ముత్యాలరాజు, పోలా భాస్కర్ హాజరీని న్యాయమూర్తి మినహాయింపు ఇచ్చారు.

ప్రవీణ్ ప్రకాష్, సురేష్‌కుమార్ హాజరు

కోర్టు ధిక్కార కేసులో పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, కమిషనరు సురేష్‌కుమార్ హైకోర్టుకు హాజరయ్యారు. ప్రైవేటు పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఎయిడెడ్ పోస్టుల భర్తీ చర్యలు ఆయా విద్యా సంస్థలకు అనుమతుల వివాదంపై వారు వివరణ ఇచ్చారు. పిటిషనర్ల పాఠశాలల్లో 32 ఎయిడెడ్ పోస్టులున్నాయని, ఈ నెల 18లోపు 24 పోస్టులను మిగులు టీచర్లతో భర్తీ చేస్తామన్నారు. మిగిలిన 8 పోస్టుల్ని సెప్టెంబరు తొలి వారంలో చేస్తామన్నారు. విచారణను ఈ నెల 21కి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ రావు రఘునందన్‌రావు ప్రకటించారు.

ఎబి విదేశీ పర్యటనపై నేడు నిర్ణయం

తీవ్ర నేరాభియోగాలు కేసుల్లో బెయిల్‌పై విడుదలయ్యాక విదేశాలకు వెళ్లిన వారున్నారని, సీనియర్ ఐపిఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావు విదేశాలకు వెళ్లేందుకు ఎందుకు నిరాకరించారని హైకోర్టు ప్రశ్నించింది. ఎబి దరఖాస్తు చేసుకున్నాక 21 రోజులు నిర్ణయం తీసుకోకుండా ఎలా ఉంటారని అడిగింది. ఆర్జిత సెలవుల (ఇఎల్)పై విదేశాలకు వెళ్లేందుకు అనుమతి నిరాకరించడం సరికాదంది. మేనకాగాంధీ కేసులో సుప్రీంకోర్టు చెప్పిన తీర్పు ప్రకారం విదేశాలకు ప్రయాణించడం ప్రాథమిక, వ్యక్తిగత స్వేచ్ఛా హక్కుల్లో భాగమని జస్టిస్ జి రామకృష్ణ ప్రసాద్ గుర్తు చేశారు. ఎబి దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం తమ నిర్ణయం వెల్లడిస్తామని ప్రకటించారు.

2,500 బస్సుల ఏర్పాటుకు సిద్ధం : ఆర్‌టిసి ఇడి

ప్రజాశక్తి - వినుకొండ (పల్నాడు జిల్లా)

రాష్ట్రవ్యాప్తంగా 2,500 నూతన బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదాం సాహెబ్ తెలిపారు. సోమవారం వినుకొండ ఆర్టీసీ డిపో గ్యారేజీ సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్టీసీ 1500 నూతన బస్సులు త్వరలో కొనుగోలు చేయడంతో పాటు వెయ్యి హైర్ బస్సులకు టెండర్ పిలిచిందన్నారు. గుంటూరు రీజియన్ జోన్ పరిధిలోని 188 బస్సులు ఆధునీకరించారన్నారు. జోన్ పరిధిలో 80 హైర్ బస్సులకు ఆరేళ్ల ఒప్పందం ముగిసిందని, వాటి స్థానంలో మరో 80 బస్సులను సెంటర్‌కు తీసుకుంటున్నామన్నారు. బస్సులో టిక్కెట్లు చెల్లింపునకు ఫోన్ పే, క్రెడిట్ కార్డ్ ఆన్లైన్ రిజర్వేషన్ (యు.టి.ఎస్) అందుబాటులో ఉందని తెలిపారు. పల్నాడు జిల్లాకి 32 నూతన బస్సులు వస్తున్నాయన్నారు. జోనల్ పరిధిలో ఆర్టీసీకి ఉపయోగం లేని స్థలాలను 15 సంవత్సరాలు లీజుకు ఇచ్చామన్నారు. పల్నాడు జిల్లాలో 28 షాపుల లీజుకు టెండర్లు పిలిచామని, ఈనెల 12తో టెండర్ ప్రక్రియ ముగుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీసీఎం ఎన్ శ్రీనివాసులు, పల్నాడు జిల్లా ఆర్ఎం శ్రీనివాసరావు, వినుకొండ డిఎం కోటా నాయక్ పాల్గొన్నారు.

రైతులే వాటాదారులు

- 50 శాతం వాటాను ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్పొద్దు
- కలెక్టరేట్ల ఎదుట పిఎసిఎస్ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రాథమిక సహకార పరపతి సంఘాలను ప్రయివేటు వ్యక్తులకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు (పిఎసిఎస్) సోమవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట ఆందోళన నిర్వహించారు. రైతులు మాత్రమే వాటాదారులుగా ఉండాలని, 50 శాతం వాటాను ప్రయిటు వ్యక్తులకు, కంపెనీలకు ఇస్తూ 1964 చట్టానికి చేసిన సవరణను రద్దు చేయాలని నినదించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని కలెక్టరేట్ల వద్ద ధర్నా చేశారు. అమలాపురంలో నిర్వహించిన ధర్నాకు పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు పాల్గొని మద్దతు తెలిపారు. పిఎసిఎస్‌లో 50శాతం వాటాలను ప్రయివేటు వ్యక్తులకు, కంపెనీలకు ఇస్తూ చేసిన చట్ట సవరణను వెంటనే రద్దు చేయాలన్నారు. సహకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తోట వెంకట రామయ్య మాట్లాడుతూ.. సమస్యలపై దశలవారీ పోరాటాలు చేసినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. రాష్ట్ర కోశాధికారి పెంకే సత్యనారాయణ పాల్గొన్నారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక నాయకులు ముప్పా వెంకటేశ్వరరావు, పి.వెంకటరెడ్డి, జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిఒ 36, 90 ప్రకారం వేతనాలు అమలు చేయాలని, 2016 ఏప్రిల్ ఒకటి నుంచి మోనిటరీ బెన్ఫిట్స్ చెల్లించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్లు, గ్రాడ్యూటీ అమలు చేయాలని కోరారు. హెచ్ఆర్ పాలసీని పూర్తి స్థాయిలో అమలు చేయడానికి గతంలో మాదిరిగా ప్రభుత్వం, బ్యాంకులు, సంఘాలు కలిపి క్యాడర్ ఫండ్ ఏర్పాటు చేయాలని, ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చిన తర్వాత మాత్రమే బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పదవి విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, సహకార సంఘాల్లోని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. ధర్నా అనంతరం స్పందనలో అధికారులకు అర్జీ అందచేశారు. శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు ధర్నా నిర్వహించారు.

కోనసీమ జిల్లా అమలాపురంలో ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవి

అనంతరం జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కు వినతిపత్రం అందజేశారు. సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.రంగనాథ్ పాల్గొన్నారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా, డిసిసిబి ఉద్యోగుల మాదిరిగా ప్రత్యేక కమిటీ ద్వారా ప్రతి ఐదేళ్లకోసారి పిఎసిఎస్ ఉద్యోగుల వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో వాటాదారులుగా ప్రయివేటు వ్యక్తులకు 50 శాతం షేర్లు ఇవ్వొచ్చని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు.

టేక్‌హోమ్ రేషన్ సరుకులన్నిటికీ

క్వాలిటీ సర్టిఫికేషన్

- ఫ్యామిలీ డాక్టర్‌తో అనుసంధానం
- సమీక్షలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ ప్లస్ కింద ఇచ్చే టేక్ హోమ్ సరుకులన్నీ అత్యంత నాణ్యతగా ఉండాలని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. సరుకుల పంపిణీపై మంచి ఎస్ఓపి పాటించాలని, క్వాలిటీ సర్టిఫికేషన్ తప్పనిసరిగా ఉండాలని సిఎం పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖలపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పంపిణీలో ఎలాంటి లోపాలూ లేకుండా అర్హులందరికీ అందేలా ఎస్ఓపి పాటించాలని, ఇందుకు సంబంధించి అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకోవాలని సిఎం సూచించారు. ప్రతినెలా మొదటి, మూడో శుక్రవారాల్లో కార్యక్రమాలు జరిగేలా చూడాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఈ కార్యక్రమాన్ని అనుసంధానం చేయాలన్నారు. పిల్లల ఎదుగుదల, టీకాలు, పౌష్టికాహారం, చక్కటి ఆరోగ్యపు అలవాట్లను ఈ కార్యక్రమం ద్వారా పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. పిపి-1, పిపి-2 తరగతుల విద్యార్థులకు ఇచ్చే పాఠ్యప్రణాళికపైనా శ్రద్ధ పెట్టాలని, ఇంగ్లీషుపై

పునాదులు పిల్లలకు అదే దశలో ఏర్పాటు కావాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ల డివైజ్‌లో స్పోకెన్ ఇంగ్లీషుకు సంబంధించి పాఠ్యాంశాలను లోడ్ చేయడం ద్వారా వివిధ పదాలను ఎలా ఉచ్ఛరించాలన్న అంశంపై పిల్లలకు శిక్షణ ఇచ్చినట్లు అవుతుందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో నాడు-నేడు పనులపై కూడా సిఎం సమీక్షించారు. ఆగస్టు 15 కల్లా పనులు ప్రారంభం కావాలని, ఫేజ్-2 కార్యక్రమంలో భాగంగా స్కూళ్లలో చేపడుతున్న పనులతోపాటు ఇవి కూడా పూర్తి కావాలన్నారు. చిల్డ్రన్స్ హోమ్‌లో సిబ్బంది కొరత లేకుండా చూడాలని, ఈ హోమ్స్ నిర్వహణలో సిబ్బందికి తర్ఫీదు ఇవ్వాలని, పిల్లలకు మంచి శిక్షణ, బోధనాంశాలు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి కెవి ఉషశ్రీ చరణ్, సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ స్పెషల్ సిఎస్ ఎమ్‌టి కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రితో శ్రీలంక ఈస్టర్న్ ప్రావిన్స్ గవర్నరు భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శ్రీలంక ఈస్టర్న్ ప్రావిన్స్ గవర్నరు సింథిల్ తొండమాన్, శ్రీలంక డిప్యూటీ హై కమిషనరు డి వెంకటేశ్వరన్ సోమవారం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో భేటీ అయ్యారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి గురించి విన్న తర్వాత సిఎంను వ్యక్తిగతంగా కలిసి ఆహ్వానించాలని తమ అధ్యక్షులు ఆదేశాల మేరకు తాము సిఎంను కలిసినట్లు వారు వెల్లడించారు. వ్యవసాయ, పారిశ్రామిక, పర్యాటక రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు శ్రీలంక ప్రతినిధులు తెలిపారు. ఆక్వారంగం వాటి ఎగుమతుల్లో రాష్ట్రం గణనీయమైన ప్రగతి సాధించిన నేపథ్యంలో శ్రీలంకలో ఆక్వా రంగ ప్రగతికి సహకారం అందించాలని సిఎంను కోరారు. శ్రీలంక ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతోందని, ఖనిజ వనరులు, పర్యాటక రంగంలో పెట్టుబడులకు శ్రీలంక ప్రభుత్వం ఆహ్వానిస్తోందని వారు తెలిపారు. శ్రీలంకలో వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించాలని సిఎంకు విజ్ఞప్తి చేశారు. శ్రీలంక నుంచి ఇండియాకు వచ్చే భక్తుల్లో 50 శాతం మంది తిరుమల ఆలయానికి వస్తారని, వారి ద్వారా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి విన్నామని శ్రీలంక ప్రతినిధులు తెలిపారు.

చిరస్మరణీయుడు అంబటి ఆంజనేయులు

- సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జర్నలిస్టుల సమస్యల కోసం అహర్నిశలూ పోరాడిన నేత అంబటి ఆంజనేయులు అని, జర్నలిజం విలువలను కాపాడటమే కాకుండా పత్రికా కార్మికుల హక్కుల సాధన కోసం కూడా ఆయన పోరాడారని పలువురు వక్తలు అంబటి సేవలను కొనియాడారు. విజయవాడలోని శ్రీరామ ఫంక్షన్ హాలులో సోమవారం ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు అధ్యక్షతన సోమవారం అంబటి ఆంజనేయులు సంస్మరణ సభ జరిగింది. ఐజెయు జాతీయ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఉన్నత భావాలతో అనేక మంది మిత్రులను సంపాదించుకున్న నాయకులు అంబటి ఆంజనేయులు అని పేర్కొన్నారు. ఐజెయు జాతీయ ప్రధాన కార్యదర్శి బల్వీందర్‌సింగ్ సంధూ మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ప్రజా వ్యతిరేక విధానాలపై జర్నలిస్టులుగా పోరాటం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఐజెయు మాజీ అధ్యక్షులు ఎస్ఎన్ సిన్హా మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అవిరళ కృషి చేశారని అంబటి సేవలను ఆయన కొనియాడారు.

ప్రజాశక్తి ఎడిటర్ బి తులసీదాస్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు, నాన్ జర్నలిస్టులు, పత్రికా కార్మికుల సమస్యలపై అంబటి పోరాటం చేశారన్నారు. ఎపి ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ.. ఉద్యమ నాయకునిగా యాజమాన్యాలు, జర్నలిస్టులు, కార్మికుల మధ్య ఎలాంటి పొరపచ్చాలు లేకుండా పోరాటం చేశారన్నారు. రాజ్యసభ మాజీ సభ్యులు కెవిపి రామచంద్రరావు మాట్లాడుతూ.. నాటి తరం నుంచి నేటి తరం వరకు జర్నలిస్టుల విలువలను కాపాడటంలో అంబటి కృషి చేశారన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. రాజకీయాల్లో మాస్ లీడర్‌కు ఉండే ఫాలోయింగ్ అంబటి ఆంజనేయులుకు ఉందన్నారు. ఎమ్మెల్యే పేర్ని నాని మాట్లాడుతూ.. ఎంత సంక్లిష్ట సమస్యనైనా మృదువుగా చెప్పటంలో అంబటి దిట్ట అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐవి సుబ్బారావు, చందు జనార్ధన్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య, సమాచారశాఖ జాయింట్ డైరెక్టరు కస్తూరి, విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నిమ్మరాజు చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అంబటి ఆంజనేయులు సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న ఐజెయు జాతీయ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి

బాలికల్లో రక్తహీనత నివారణకు చర్యలు : సిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వాస్పత్రులు, ఏరియా ఆస్పత్రులతో సహా ఇతర ఆస్పత్రుల్లో వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని వైద్యారోగ్యశాఖ అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలోని వైద్యారోగ్యశాఖ కార్యక్రమాలపై సోమవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితుల్లోనూ వివిధ ప్రభుత్వాస్పత్రుల్లో మరింత మెరుగైన సేవలు అందించాలని స్పష్టం చేశారు. 10 నుంచి 19 ఏళ్లలోపు బాలికల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రైవేటు పాఠశాలల్లోని బాలికలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రక్త హీనత కలిగిన బాలికలతో ఐరన్ ఫోలిక్ మాత్రలు మింగించాలని స్పష్టం చేశారు. నిర్మాణంలో ఉన్న 5 వైద్య కళాశాలలను త్వరలో ప్రారంభించేందుకు వీలుగా వేగవంతంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వైద్యారోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు.. పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వైద్యారోగ్యశాఖకు చెందిన కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి, డాక్టర్ వనిత, వైద్యారోగ్యశాఖ కమిషనరు జె నివాస్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణపై పటిష్ట చర్యలు : సిఎస్

రాష్ట్రంలోని వివిధ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఘణ, ద్రవ వ్యర్థాల నిర్వహణతోపాటు పారిశ్రామిక వ్యర్థాల నివారణను ఆయా స్థానిక సంస్థలు పటిష్ట చర్యలు చేపట్టాలని సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి, ఎపిఐఐసి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఘణ, ద్రవ వ్యర్థాల నిర్వహణ, పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణను సక్రమంగా నిర్వహించని స్థానిక సంస్థలకు వెంటనే నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు అయోధ్యరామిరెడ్డి ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు.

తాడిపత్రి పట్టణ సిఐ ఆత్మహత్య

- పని ఒత్తిళ్లే కారణం : సిఐ కుమార్తె
- రాజకీయ వేధింపులన్న జెసి. ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - తాడిపత్రి

అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణ సిఐ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది. ఈయన మృతిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. పని ఒత్తిడి కారణంగా ఆత్మహత్య చేసుకున్నారని కుటుంబసభ్యులు చెబుతుండగా, రాజకీయ వేధింపుల వల్ల మృతి చెందాడని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. పోలీసులు, కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తాడిపత్రి పట్టణ పోలీస్ స్టేషన్ సిఐగా ఆనందరావు (51) విధులు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని నంద్యాల రోడ్డు వద్ద ఓ అద్దె ఇంట్లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. ఆదివారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన తర్వాత అర్ధరాత్రి సమయంలో తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. వేకువజామున కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. డిఎస్‌పి గంగయ్య, పట్టణ ఎస్ఐ ధరణి బాబు ఘటన స్థలాన్నికి చేరుకున్నారు. మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్‌పి శ్రీనివాసులు ఆస్పత్రికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోందని మీడియాకు ఎస్‌పి తెలిపారు. వృత్తిపరంగా ఆయనపై ఎలాంటి ఒత్తిళ్లు లేవన్నారు.

ఆనందరావు (ఫైల్)

కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. పోస్టుమార్టం అనంతరం అంత్య క్రియల నిమిత్తం ఆనందరావు సొంత గ్రామమైన చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం కల్లోడుపల్లి గ్రామానికి తరలించారు. 1998లో ఎస్ఐగా పోలీస్ శాఖలో ఆనందరావు చేరారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఒత్తిడి ఉందని చెప్పేవారు : సిఐ కుమార్తె

విధి నిర్వహణలో గత మూడు నెలలుగా తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నట్లు నాన్న చెప్పేవారని మృతుని కుమార్తె భవ్య తెలిపారు.

రాజకీయ ఒత్తిళ్లే కారణం : జెసి ప్రభాకర్‌రెడ్డి

ఆనందరావు ఆత్మహత్యకు రాజకీయ ఒత్తిళ్లే కారణమని మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఓ కేసులో వైసిపి నాయకుడిని చేర్చాల్సి ఉండగా ఆ నాయకుడిని కేసులో చేర్చరాదంటూ అధికార పార్టీ నాయకులు సిఐపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు.

చిల్లర రాజకీయాలు తగవు : ఎమ్మెల్యే పెద్దారెడ్డి

సిఐ ఆత్మహత్యను రాజకీయం చేసి, చిల్లర రాజకీయాలకు పాల్పడడం తగదని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. జెసి.ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. సిఐ మృతిపై అవసరం అయితే విచారణ జరిపించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే తెలిపారు.

'జెవికె' కిట్ల అవినీతిపై విచారణ

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న జగనన్న విద్యాకానుక (జెవికె) కిట్ల అవినీతిపై విచారణ జరిపించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న జెవికె కిట్లలో అవినీతి జరిగిందని వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. గత రెండేళ్లుగా పాఠశాలల్లో చేరిన విద్యార్థుల కంటే ఎక్కువ కిట్లను ప్రభుత్వం కొనుగోలు చేసిందని తెలిపారు. మిగిలిన కిట్లు వచ్చే విద్యా సంవత్సరానికి అడ్జెస్ట్ చేయకుండా సమగ్ర శిక్షా అభియాన్ అవసరానికి మించి కిట్లకు టెండర్లు పిలిచిందని పేర్కొన్నారు. 2021-22, 2022-23 సంవత్సరాల్లో 9,28,824 కిట్లు మిగిలినా, 2023-24 సంవత్సరానికి 43 లక్షల కిట్లు ఆర్డర్ ఇచ్చారని వివరించారు. కానీ 2022-23లో 40,31,239 మంది విద్యార్థులు మాత్రమే పాఠశాలల్లో చేరారని, 5 శాతం అదనంగా కలుపుకున్నా ఈ సంఖ్య ఎక్కువే అవుతుందని అన్నారు. విద్యార్థులకు పంపిణీ చేయగా మిగిలిన 9,28,824 కిట్లు ఏమయ్యాయి? అదనంగా కిట్లు ఎందుకు ఆర్డర్ ఇస్తున్నారు? అనేది విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ధర్నాలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

ఉక్కునగరంలో విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనలపై ధర్నా

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ఉక్కు నగరంలో నివాసముంటున్న కార్మికులకు విద్యుత్ ఛార్జీలను పెంచుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తీసుకొచ్చిన ప్రతిపాదనలను నిరసిస్తూ స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం ఉక్కు ప్రధాన పరిపాలనా భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా అమలులో ఉన్న విద్యుత్ ఛార్జీలను అమాంతం పెంచడం దారుణమన్నారు. నివాసయోగ్యంగా లేనటువంటి క్వార్టర్స్‌లో కార్మికులు నివసిస్తున్నారని, వారిపై భారాలు మోపడం సరికాదన్నారు. గతంలో ఐఎన్‌టియుసి హయాంలో జరిగిన ఒప్పందం వల్ల క్వార్టర్స్ ఖాళీ చేస్తే హెచ్‌ఆర్‌ఎ పొందే సౌకర్యాన్ని కూడా కార్మికులు కోల్పోయారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలన్నారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైటి.దాస్, యు.రామస్వామి మాట్లాడుతూ.. కార్మికులపై పడుతున్న భారాలపై ప్రస్తుత గుర్తింపు యూనియన్ స్పందించకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ మిత్రపక్షాల నాయకులు డివి.రమణారెడ్డి, డి.సురేష్ బాబు, సిహెచ్.సన్యాసిరావు, సిఐటియు నాయకులు పి.శ్రీనివాసరాజు, యు.వెంకటేశ్వర్లు, బి.అప్పారావు, కె.గంగాధర్ పాల్గొన్నారు.

మహిళలతో సెల్ఫీ తీసుకుంటున్న లోకేష్

నా తల్లి కష్టం.. ఏ తల్లికీ రానివ్వను

- నిర్భయ చట్టాన్ని కఠినంగా అమలు చేస్తాం
- యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

అంగన్‌వాడీ నుంచి పీజీ వరకు మహిళలను గౌరవించాలనే బాధ్యత పెంపొందేలా చర్యలు తీసుకుంటామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ హామీనిచ్చారు. శాసనసభ సాక్షిగా తన తల్లిని అవమానించారని, ఆమె బయటకు రారని, ఎన్‌టిఆర్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని చెప్పారు. తన తల్లి పడే బాధ మరే తల్లి పడకూడదని అన్నారు. ఈ రోజుకూ వైసిపి నేతలు అవమానిస్తూ ఉంటారని, ఇది ఎంత వరకు న్యాయమో మహిళలందరూ ఆలోచించాలన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 145వ రోజుకు చేరుకుంది. సోమవారం నెల్లూరు నగరంలోని అనిల్‌గార్డెన్స్‌లో 'మహిళాశక్తితో లోకేష్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ..నా తల్లికి జరిగిన అవమానం ఏ తల్లికీ రానివ్వనన్నారు. మహిళలను అవమానించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. నిర్భయ చట్టాన్ని అమలుచేయడం ద్వారా పటిష్టమైన రక్షణ కల్పిస్తామన్నారు. సొంత తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని వ్యక్తి మహిళలకేం న్యాయం చేస్తారని సిఎం జగన్‌నుద్దేశించి విమర్శించారు. 145రోజుల సుదీర్ఘ పాదయాత్రలో మహిళల కష్టాలు తెలుసుకున్నాకే మహాశక్తి కార్యక్రమాన్ని మహానాడు సాక్షిగా చంద్రబాబు ప్రకటించారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కడపకు చెందిన రూ.10 డాక్టర్ నూరిఫర్వీన్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అభ్యర్థులు

తక్షణమే ఫిజికల్ టెస్ట్ నిర్వహించాలి

- ఎస్ఐ, కానిస్టేబుల్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల ఆందోళన

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎస్ఐ, కానిస్టేబుల్ రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు తమకు తక్షణమే ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఆందోళన నిర్వహించారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి వినతిపత్రం అందజేశారు. కర్నూలు, నంద్యాల కలెక్టరేట్ల ఎదుట ఆందోళన నిర్వహించారు. ప్రిలిమ్స్ పరీక్షలు జనవరి చివరిలో నిర్వహించి, ఎమ్మెల్సీ ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం హడావుడి చేసిందన్నారు. ఎన్నికల ముగియగానే తమను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులతో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కడప కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిఆర్ఒకు వినతిపత్రం అందజేశారు. తక్షణమే ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని, లేనిపక్షంలో చలో విజయవాడ నిర్వహిస్తామని విద్యార్థి సంఘం నాయకులు, సిఐటియు నేతలు హెచ్చరించారు.

గన్నవరం మండలం పురుషోత్తపట్నంలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

గన్నవరం మండలం ముస్తాబాదలో డప్పు వాయిద్యాలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

బిజెపితో అంటకాగితే ఎన్‌సిపి, శివసేన గతే పడుతుంది

వైసిపి, టిడిపిలకు వి శ్రీనివాసరావు హెచ్చరిక

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి, గన్నవరం

బిజెపితో అంటకాగితే మహారాష్ట్రలో ఎన్‌సిపి, శివసేనలకు పట్టిన గతే వైసిపి, టిడిపిలకు పడుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. బిజెపితో అంటకాగిన పార్టీలను ముక్కలు చేయడం, ఆ తర్వాత మింగేయడం ఆ పార్టీ నైజమని తెలిపారు. 14 రోజులుగా సాగుతున్న 'పోలవరం నిర్వాసితుల పోరుకేక' మహా పాదయాత్ర సోమవారం కృష్ణా జిల్లా గన్నవరం నుంచి ఉత్సాహంగా ముందుకు సాగింది. గన్నవరం మండలం వివిఎస్.పురం, పురుషోత్తపట్నం మీదుగా మధ్నాహ్నానికి ముస్తాబాదకు చేరుకుంది. అక్కడ తీన్మార్ వాయిద్యాలతో గ్రామ మాజీ సర్పంచ్ బొమ్మారెడ్డి రాజశేఖరరెడ్డి, పలువురు రైతులు, సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు యాత్ర బృందానికి ఎదురేగి ఘన స్వాగతం పలికారు. అనంతరం మర్రిచెట్టు సెంటర్లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కళ్లం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉమ్మడి పౌరస్మృతి బిల్లు (కామన్ సివిల్ కోడ్) తీసుకొచ్చి ప్రజల మధ్య మత వైషమ్యాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. వైవిధ్యం కలిగిన మన దేశంలో హిందూత్వం పేరుతో ఆధిపత్య ధోరణులను ప్రజలపై రుద్దే ప్రయత్నాలను చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాలు వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు అర్థం కావడం లేదని, అందుకే బిజెపికి తోక పార్టీలుగా నడిచేందుకు ప్రయత్నిస్తున్నాయని వివరించారు. ఇదే విధానం కొనసాగితే ఆ పార్టీలను బిజెపి మిగేయడం ఖాయమన్నారు.

గన్నవరంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో పాదయాత్ర బృందంలోని మహిళ పాదాలను పరీక్షిస్తున్న వైద్యులు

త్యాగధనుల రుణం తీర్చుకోవాలి

త్యాగధనులైన పోలవరం నిర్వాసితుల రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజలపై ఉందని వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు వలన విద్యుత్, సాగు, తాగునీరు ప్రయోజనాలు పొందనున్న మనందరం అక్కడి త్యాగధనులకు అండగా ఉండాలని, మద్దతు, సంఘీభావం తెలియజేయాలని కోరారు. పదేళ్ల నుంచి పోలవరం నిర్వాసితుల సమస్య ముందుకు వచ్చినా పాలక పార్టీలు పట్టించుకోలేదన్నారు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం నిర్మాణానికి, నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికి పూర్తి స్థాయిలో నిధులు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రానిదే తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని నిలదీసి నిధులు రాబట్టాలని బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులు తమ సమస్యల పరిష్కారం కోసం మొక్కవోని దీక్షతో ముందుకు సాగుతున్నారని అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య నడియాడిన గన్నవరం ప్రాంతంలో పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరిలో ఉందని పేర్కొన్నారు. గిరిజనులకు న్యాయం జరిగే వరకూ ఈ ప్రాంత ప్రజలు వారికి అండగా నిలవాలని కోరారు. గిరిజన సంఘం నాయకురాలు మొడియం నాగమణి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి డి.రాము, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రసన్న కుమార్, సిపిఎం కృష్ణా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కళ్లం వెంకటేశ్వరరావు, గిరిజనుల పోరాట సంఘం నాయకులు నాగమణి తదితరులు ప్రసంగించారు.

విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ డాబా కొట్లు సెంటర్‌కు యాత్ర చేరుకునే సమయంలో పాయకాపురం వద్ద జోరున వర్షం ప్రారంభమైంది. పాదయాత్ర బృందంలోని వారు గొడుగులు, రైన్ కోట్లు ధరించి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా డాబా కొట్లు సెంటర్ వరకూ కొనసాగించారు. అనంతరం అక్కడ బహిరంగ సభ జరిగింది.

నేడు విజయవాడలో మహా ధర్నా

- సిపిఎం పాదయాత్రకు వెల్లివిరుస్తున్న సంఘీభావం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురవుతున్న పోలవరం నిర్వాసితుల పోరు కేక గత 14 రోజులుగా విజయవంతంగా సాగుతోంది. సిపిఎం సారథ్యంలో జూన్ 20న నెల్లిపాక (భద్రాచలం)లో ప్రారంభమైన ఈ మహా పాదయాత్రకు అపూర్వరీతిలో సంఘీభావం వెల్లివిరుస్తున్నది. ఎండనక, వాననక, పగలనక రేయనక అడవి బిడ్డలు ఏకరీతిన సాగిస్తున్న ఈ యాత్ర నాలుగు జిల్లాల్లోని 15 మండలాలు, 235 గ్రామాల మీదుగా గోదావరి, శబరి నదులను దాటుతూ సోమవారం నాటికి 380 కిలోమీటర్లకు చేరుకుంది. 12 ఏళ్ల బాలిక, బాలురతోపాటుగా 70 ఏళ్ల వృద్ధుల వరకు పాదయాత్రలో నడిచారు. దారిపొడవునా పాదయాత్రకు స్థానికులు నీరాజనాలు పలికారు. అమరులైన పోరాట యోధుల స్థూపాల వద్ద నివాళు లర్పిస్తూ, ప్రధాన కూడళ్లలో సభలు నిర్వహిస్తూ, నిర్వాసితులను చైతన్యపరుస్తూ ప్రవాహంలా సాగిపోతున్న ఈ పాదయాత్రలో గిరిజన యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతి గ్రామంలో పేదలే ఇంటింటికీ బియ్యం, పప్పు దినుసులు సేకరించి పాదయాత్రలో పాల్గొన్నవారికి భోజనం పెట్టారు. 48 డిగ్రీల ఎండలో కాలికి బొబ్బలెక్కినా వెనకడుగు వేయలేదు. మీకు తోడుగా మేమున్నాం అంటూ సిపిఐ, టిడిపి, జనసేన తదితర పార్టీల నాయకులు, కార్యకర్తలు, వైసిపి స్థానిక నాయకులు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల నేతలు, ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) ఎమ్మెల్సీలు, చలసాని శ్రీనివాస్, నేతి మహేశ్వరరావు వంటి మేధావులు, ఇతర సంస్థలు, వ్యక్తులు యాత్రలో పాల్గొని సంఘీభావాన్ని తెలియజేస్తున్నారు. పోలవరం నుండి మరో ఉప పాదయాత్ర జూన్ 28న ప్రారంభమయి తరువాత ప్రధాన యాత్రలో భాగస్వామి అయ్యింది. మహా పాదయాత్రకు పతాక సన్నివేశంగా ఈ నెల 4న విజయవాడలో మహా ధర్నాకు అంతా కదలి వస్తున్నారు. ధర్నాలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, పాదయాత్రకు నాయకత్వం వహించిన రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావుతోపాటు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ప్రత్యేకహోదా విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ ఫోరమ్ అధ్యక్షులు నేతి మహేశ్వరరావు, వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు పాల్గొంటారు.

పాదయాత్ర స్ఫూర్తినిచ్చింది

'ప్రజాశక్తి'తో పలువురు నేతలు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి, గన్నవరం

సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన పోలవరం నిర్వాసితుల పోరుకేక మహా పాదయాత్ర కృష్ణా జిల్లా గన్నవరం మండలం ముస్తాబాద చేరుకొనే సరికి 350 కిలోమీటర్లు దాటింది. ఈ యాత్ర 225 గ్రామాల మీదుగా సాగింది. 98 చోట్ల సభలు జరిగాయి. ప్రతి రోజు 500 మందికిపైగా యాత్రలో పాల్గొంటున్నారు. పోలవరం ప్రాజెక్టు కోసం సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. పునరావాసం, పరిహారం తదితర విషయాల్లో తీవ్ర అన్యాయం చేస్తున్నాయి. వారికి న్యాయం చేయాలని కోరుతూ చేపట్టిన మహా పాదయాత్రలో పాల్గొంటున్న పలువురిని 'ప్రజాశక్తి' కలిసి వారి అభిప్రాయాలు తీసుకుంది. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వారు డిమాండ్ చేశారు. అంతవరకూ పోరాటం కొనసాగుతుందన్నారు.

ఎన్నో అనుభవాలు నేర్పింది

ఈ మహా పాదయాత్రలో పోలవరం ముంపు గ్రామాల్లోకి వెళ్లినప్పుడు చాలా అనుభవాలు ఎదురయ్యాయి. 250 మహిళలు ఎండను సైతం లెక్క చేయకుండా నడవడం గొప్ప విశేషం. యాత్ర నుంచి అనేకానుభవాలు నేర్చుకున్నాను. గిరిజనుల సమస్యలపై పోరాడుతున్నది ఒక్క ఎర్రజెండా మాత్రమే.

-అనిల్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి

పోరాటాల ద్వారానే సమస్యలకు పరిష్కారం

ముంపు మండలాల్లోని ప్రజల వ్యధలు, సమస్యలు కళ్లారా చూడడంతో గుండె తరుక్కుపోయింది. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా చేయడంలో యాత్ర ద్వారా మంచి ప్రయత్నం జరిగింది. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పోలవరం నిర్వాసితుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి.

-డి.రాము, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు

పాదయాత్రలో నడిచిన ప్రతి ఒక్కరికీ అభినందనలు

ఎండా, వాన లెక్కచేయకుండా నడిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. 14 రోజులు మహిళలు 350 కిలోమీటర్లు నడిచారంటే వారి పట్టుదల, సమస్యను సాధించాలనే కోరిక ఎంత బలంగా ఉందో మాకు అర్థమైంది. వరదల్లో ముంపునకు గురైన ఓ గ్రామానికి వెళ్లినప్పుడు వారు చెప్పిన మాటలు వింటే బాధ కలిగింది. ఒక కొవ్వొత్తి ఇచ్చారుగానీ, దానిని వెలిగించుకోవడానికి అగ్గిపెట్టె ఇవ్వలేదని ఓ మహిళ చెప్పారు. కిలో ఉల్లిపాయలు ఇచ్చి, వంట చేసుకునేందుకు కూరగాయలు ఇవ్వలేదని మరో మహిళ ఆవేదన వ్యక్తం చేశారు.

-ప్రసన్న కుమార్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు

ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటం

పోలవరం నిర్వాసితుల సమస్య పరిష్కారమయ్యే వరకూ ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఒత్తిడి తెస్తూనే ఉంటాం. పాదయాత్ర ఎంతో ఉత్సాహాన్ని నింపింది. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ పోరాడతాం. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలుతోపాటు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పూర్తి స్థాయిలో న్యాయం చేయాలి. ఎన్నో ఇబ్బందులు ఎదురైనా పాదయాత్రలో నడిచిన మహిళలందరికీ అభినందనలు.

-నాగమణి, పోలవరం నిర్వాసితుల కమిటీ సభ్యులు

నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇప్పించిన ఘనత ఎర్ర జెండాదే

గన్నవరం నియోజకవర్గంలో పోలవరం కాలువ, విమానాశ్రయ విస్తరణ, వీరపనేనిగూడెంలో పారిశ్రామికవాడ పేరుతో చేపట్టిన భూ సేకరణలో రైతులకు న్యాయమైన పరిహారం ఇప్పించడంలో సిపిఎం కీలక పాత్ర పోషించింది. ఎకరానికి రూ.60 వేల నుండి లక్ష రూపాయలు ఇస్తామని ప్రభుత్వం చెప్పగా, రూ.3 లక్షల నుండి రూ.6 లక్షల వరకు, రెండో విడతలో రూ.30 లక్షల వరకు పరిహారం సాధించాం.

-కళ్లం వెంకటేశ్వరరావు, సిపిఎం కృష్ణా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

పంటల బీమా అప్పీల్ పొడిగించాలి

ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పంటల బీమాపై అప్పీల్ చేసుకునేందుకు ఈ నెల 10 వరకు గడువు పెంచాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర రెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2022 ఖరీఫ్‌లో అకాల వర్షాలు, అధిక వర్షాలు, వడగంట్ల వానలు, నకిలీ విత్తనాలు, వాతావరణ ప్రతికూల పరిస్థితుల వల్ల రాష్ట్రంలో పత్తి, మొక్కజొన్న, మిరప, టమోటా, ఉల్లి, బత్తాయి, మామిడి వంటి అనేక పంటలు 20 లక్షల ఎకరాలకు పైగా నష్టపోయాయని వివరించారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం జూన్ 30న అరకొరగా పంటల బీమా పరిహారం ప్రకటిచిందని తెలిపారు. జాబితాలో పేర్లు రానివారు అర్జీలు పెట్టుకునేందుకు కేవలం మూడు రోజులు మాత్రమే గడువు ప్రకటించిందని, ఈ గడువు మంగళవారంతో ముగుస్తుందని పేర్కొన్నారు. గడువును జులై 10 వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. రైతులు ఆర్‌బికె కేంద్రాలు, వ్యవసాయశాఖ అధికారులకు ఎక్కడికక్కడ వినతిపత్రాలు ఇవ్వాలని కోరారు. తెలంగాణ స్టేట్ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తయారు చేసిన విత్తనాలు కాలం చెల్లాయని, వాటిని ఆర్‌బికెల ద్వారా బాపట్ల జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులు సరఫరా చేస్తున్నారని మరో ప్రకటనలో తెలిపారు. వాటి కాలపరిమితి గతేడాది డిసెంబర్‌తోనే ముగిసిందని వివరించారు. రైతులను ఆదుకోవాల్సిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు కాలం చెల్లిన విత్తనాలను అంటగట్టే కేంద్రాలుగా మారాయని విమర్శించారు. ఇలాంటి పొరపాటు పద్ధతులు అనుసరిస్తున్న వారిపై విచారణ చేసి, బాధ్యులైన అధికారులు, ఆర్‌బికె సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలం చెల్లిన విత్తనాల స్థానంలో నాణ్యమైన విత్తనాలు రైతులకు సరఫరా చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

అనిల్ అంబానీని విచారించిన ఇడి

ముంబయి : రిలయన్స్ ఎడిఎ గ్రూప్ అధినేత అనిల్ అంబానీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు ప్రశ్నించారు. విదేశీ మారక చట్టం (ఫెమా) నిబంధనలు ఉల్లంఘన కేసులో సోమవారం అనిల్ విచారణకు హాజరయ్యారు. ముంబయిలోని ఇడి కార్యాలయంలో అధికారులు అనిల్ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. కాగా.. ఏ కేసులో ఆయనను విచారించారనే విషయం బయటికి రాలేదు.

'ఆడుదాం ఆంధ్రా'కు విరాళాల సేకరణ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి -అమరావతి

అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని భావిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' పోటీలకు నిధుల సమస్య వేధిస్తోంది. ప్రైవేటు నిధులను సమకూర్చుకుని పోటీలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. 49 రోజులపాటు నిర్వహించే ఈ క్రీడా సంబరాల్లో మొత్తం 2.99 లక్షల ఆటలు నిర్వహించనున్నారు. దీనికోసం ప్రాథమికంగా రూ.45 కోట్లు ఖర్చవుతుందని క్రీడాశాఖ అధికారులు అంచనా వేయగా, తుది అంచనాల్లో ఈ నిధుల వ్యయం మరింత ఎక్కువగా ఉంటుందని అంటున్నారు.

ఈ నేపథ్యంలోనే గ్రామ-వార్డు, మండల, నియోజకవర్గాల స్థాయిలో జరిగే పోటీలకు ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలకు నిధుల సమీకరణ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. వారి నియోజకవర్గాల అభివృద్ధి కోసం వచ్చే నిధుల్లో కొంత భాగాన్ని ఈ క్రీడల కోసం వ్యయం చేయాలని సూచించారు. ఇదే తరహాలో ఆయా ప్రాంతాల్లోని పలు ప్రభుత్వ శాఖలు, ప్రైవేటు పారిశ్రామిక రంగాల ఆదాయం నుంచి కేటాయించే సిఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధుల్లో కూడా కొంత భాగం ఈ క్రీడలకు సేకరించేలా స్థానికంగా చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. ఈ పోటీలకు అవసరమైన స్థాయిలో నగదు సమీకరణ జరిగితే ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వాల్సిన అవసరం ఉండదని ఒక అధికారి వ్యాఖ్యానించారు.

రూ.2000 నోట్లు 76 శాతం వెనక్కి

- విలువ రూ.2.72 లక్షల కోట్లు
- ఆర్‌బిఐ వెల్లడి

న్యూఢిల్లీ : చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 76 శాతం కరెన్సీని ఉపసంహరించుకున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వెల్లడించింది. ఈ పెద్ద నోటును వెనక్కి తీసుకుంటున్నట్లు మే 19న ప్రకటన చేసిన విషయం తెలిసిందే. 2023 జూన్ 30 నాటికి బ్యాంక్‌లకు తిరిగి వచ్చిన మొత్తం నోట్ల విలువ రూ. 2.72 లక్షల కోట్లుగా ఉందని తాజాగా వెల్లడించింది. మార్చి 31 నాటికి రూ.3.62 లక్షల కోట్ల పెద్దనోట్లు చలామణిలో ఉన్నాయి. మే 19 నాటికి రూ.3.56 లక్షల కోట్లు చెలామణిలో ఉండగా.. ఇప్పటి వరకు 76 శాతం రిటర్న్ వచ్చాయని తెలిపింది. మే1 నాటికి మార్కెట్‌లో ఇంకా రూ.84,000 కోట్ల విలువ చేసే రూ.2వేల నోట్లు చెలామణిలో ఉన్నాయి. చెలామణి నుండి తిరిగి వచ్చిన రూ. 2,000 మొత్తం నోట్లలో 87శాతం డిపాజిట్ల రూపంలో ఉండగా, మిగిలిన 13శాతం ఇతర డినామినేషన్ నోట్లలోకి మార్పిడి జరిగిందని రిజర్వ్ బ్యాంక్ తెలిపింది. కాగా.. 2018-19లో రూ. 2,000 నోట్ల ముద్రణను నిలిపివేసింది. మే19న ఉపసంహరణ ప్రకటన సమయంలో వినియోగదారులకు రూ.2వేల నోట్లు ఇవ్వొద్దని బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రజలు తమ వద్ద ఉన్న నోట్లను మార్చుకునేందుకు సెప్టెంబరు 30వ తేదీ వరకు గడువు ఉందని.. ఆ లోపు నోట్లను మార్చుకోవాలని ఆర్‌బిఐ మరోమారు గుర్తు చేసింది. 2016లో రూ.1000, రూ.500 నోట్ల రద్దు చేసి తర్వాత రూ.2వేల నోట్లను మోడీ సర్కార్ ప్రవేశపెట్టింది. తిరిగి ఎందుకు ఉపసంహరించు కుంటుందో మాత్రం ప్రకటన చేయలేదు.

జియో నుంచి 999కే ఫోన్

హైదరాబాద్ : రిలయన్స్ జియో చౌక ధరలో 4జి ఫోన్‌ను విడుదల చేసింది. దీని ధరను రూ. 999గా నిర్ణయించింది. ఈ ఫోన్‌తో పాటు కొత్త రూ. 123 ప్లాన్ ప్రకటించింది. ఇది 28 రోజుల పాటు చెల్లుబాటు అవుతుందని పేర్కొంది. అన్‌లిమిటెడ్ కాల్స్‌తో పాటు నెలకు 14జిబి డేటాను అందించనున్నట్లు తెలిపింది. ఇప్పటికే 2జి ఫోన్లను వాడుతున్న వారిని లక్ష్యంగా 4జిలోకి మళ్లించడాకని పేర్కొంది.

రష్యా నుంచి చమురు దిగుమతిలో భారత్ రికార్డ్

న్యూఢిల్లీ : రష్యా నుంచి ముడి చమురు దిగుమతి చేసుకోవడంలో భారత్ నూతన రికార్డ్‌ను సృష్టించింది. ప్రస్తుత ఏడాది జూన్‌లో ఏకంగా రోజుకు 2.2 మిలియన్ బ్యారెళ్ల చమురు దిగుమతి జరిగిందని డేటా అనలాసిస్ సంస్థ కెప్లర్ తెలిపింది. రష్యా, ఉక్రెయిన్ పరిణామాలతో రష్యా చమురు దిగుమతిపై పలు యూరప్ దేశాలు ఆంక్షలు విధించాయి. దీంతో చౌకగా రష్యా చమురు దిగుమతిలో ఇండియన్ ఆయిల్ టాప్‌లో ఉంది.

ఎంజి మోటార్‌కు జాన్వీ కపూర్ ప్రచారం

న్యూఢిల్లీ : బ్రిటిష్ ఆటోమొబైల్ బ్రాండ్ ఎంజి మోటార్ ఇండియా తన ప్రచారకర్తగా జాన్వీ కపూర్, క్రికెటర్ ఇషాన్ కిషన్‌తో భాగస్వామ్యం కుదర్చుకుంది. వీరిద్దరిని తమ ఉత్పత్తుల ప్రచారకర్తలుగా నియమించుకున్నట్లు పేర్కొంది. తొలుత జెన్ జడ్ కామెట్ ఇవికి ప్రచారం కల్పించనున్నారని తెలిపింది.

శ్రీ సప్తగిరి లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయము
సంగలపల్లి (గ్రా), వి.యన్.పల్లి(మం), కడప జిల్లా.

e-Procurement Tender
NIT NO.TTD-65022(31)/72/2022-EE
Dt:14.12.2022

దేవాలయ నిర్మాణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.

ఇట్లు: ధర్మకర్త

IN THE COURT OF THE HON'BLE I SENIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT HYDERABAD
S. O. P. No. 63 of 2023

Between:
Smt. Chadalavada Karuna & others ..... Petitioners
AND
HDFC Bank, & others ...Respondents

To,
D3: All Concerned

Take notice that the petitioners have filed the above S.O.P for granting succession certificate to the petitioners in respect of the estate of late: Chadalavada Satish Chandra comprising of the schedule securities and the said case is stands posted to 11-08-2023. If any person or persons having any claims, objections if whatsoever, they may appear either in person or through an Advocate before the above Hon'ble Court on 11-08-2023 at 10-30 A.M. Otherwise the matter will be decided basing on the documents available on record.

SCHEDULE-I: D mat account maintained by Chadalavada Satish Chandra in account No: 55683467, for an amount of **Rs. 5,94,991-10Ps** HDFC Bank, Banjara Hills Branch, Hyderabad i.e., Respondent No. 1

SCHEDULE -II: A sum of **Rs. 8,15,088/-** is lying to the credit of Chadalavada Satish Chandra in account No: 881036269389, Digibank by DBS, Rajbhavan Road, Hyderabad i.e., respondent No: 2.

"BY ORDER OF THE COURT"
K. P. Saradhi, Advocate
Off. Flat No. 102, 1st Floor, Temple View Residency, Opp. Bata Show Room, Beside Lane of Auto Go Gas Station, Lakdikapul, Hyderabad-004
Cell: 9246374879, Office No. 8639973528.
saradhikatamaneni@yahoo.com
Date: 03-07-2023

తొలి త్రైమాసికంలో లోటు రూ.50,450 కోట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఏప్రిల్ నుంచి జూన్ వరకు కొనసాగిన తొలి త్రైమాసికంలో రాష్ట్ర సొంత పన్నుల ద్వారా రూ.21,359 కోట్లు ఆదాయం మాత్రమే సమకూరింది. వ్యయం మాత్రం ఏకంగా రూ.71,809 కోట్లకు చేరింది. దీంతో లోటు రూ.50,450 కోట్లకు చేరిపోయింది. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో ఇంత భారీ లోటు నమోదుకావడం 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి ఇదే మొదటిసారిగా కనిపిస్తోంది. ఆదాయానికి.. వ్యయానికీ మధ్య అంతరంగా ఉన్న రూ.50 వేల కోట్లకుపైగా నిధుల్లో సగానికిపైగా రిజర్వ్‌బ్యాంకు నిర్వహించే బహిరంగ మార్కెట్ రుణాలుగా సమకూర్చుకున్నట్లు తెలిసింది. ఆ తరువాత కేంద్రం నుంచి వచ్చిన 2014-15 ఆర్థిక సంవత్సర లోటు నిధులు, పోలవరానికి వచ్చిన నిధులను జతచేసి వ్యయాన్ని అధిగమించినట్లు ఆర్థికశాఖ అధికారులు చెబుతున్నారు.

ఖర్చులు తగ్గించుకునే పరిస్థితి లేకపోవడంతో ఆదాయాన్ని పెంచుకోవడమే మార్గమని ఆర్థికశాఖ అధికారులు అంటున్నారు. దీనికోసం పెండింగ్ బకాయిలను కఠినంగా వసూలు చేయడం, ఆదాయ వసూళ్లలో లీకేజీలను అరికట్టడం, కేంద్రం నుంచి మరిన్ని నిధులను రాబట్టుకోవడంపై దృష్టి సారించాలని ఆ శాఖ ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

టాటా కార్లు మళ్ళీ ప్రియం

న్యూఢిల్లీ : ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ మరోమారు ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. జులై 17 నుంచి ప్యాసింజర్ వాహన ధరలను 0.6 శాతం హెచ్చించనున్నట్లు వెల్లడించింది. ముడి సరుకుల ధరలు పెరగడమే ఇందుకు కారణమని పేర్కొంది. ఇంతక్రితం జనవరి, మే మాసాల్లోనూ ధరలు పెంచింది.

ఇహెచ్‌ఎస్ కింద వైద్యానికి నిరాకరిస్తే చర్యలు

ఎమ్‌టి కృష్ణబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లించాల్సిన బకాయిలన్నిటినీ ప్రభుత్వం చెల్లించిందని, రాష్ట్రంలో ఏ నెట్‌వర్క్ ఆస్పత్రైనా వైద్యం నిరాకరిస్తే వెంటనే 104 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి 3వ ఆప్షన్ ద్వారా రిజెక్టు చేసిన ఆస్పత్రి వివరాలు నమోదు చేస్తే ఆయా ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటామని వైద్యారోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎమ్‌టి కృష్ణబాబు తెలిపారు. వైద్యారోగ్యశాఖలో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగుల సమస్యలపై ఉద్యోగ సంఘాల నేతలతో వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు సచివాలయంలోని ఐదో బ్లాక్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గతేడాది మంజూరు చేసిన బోధనాస్పత్రుల్లో విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో వివిధ కేటగిరీల్లో నియమించబడ్డ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 9 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ వేతనం అందలేదనే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తీసుకెళ్లారు. ఈ సమావేశంలో ఎఎన్ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సులోచనమ్మ, ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జయధీర్, ఎఎన్ఎంల సంఘం నాయకులు, క్లాస్-4 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అమూల్ భూమి పూజకు సిఎం స్వస్తి పలకాలి

- మాజీ రాజ్యసభ సభ్యులు పెనుమల్లి మధు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మంగళవారం చిత్తూరు డెయిరీ స్థానంలో అమూల్ డెయిరీని స్థాపించేందుకు భూమి పూజ చేయడానికి వస్తున్నారని, ఈ నిర్ణయానికి వెంటనే స్వస్తి పలకాలని సిపిఎం మాజీ రాజ్యసభ సభ్యులు పెనుమల్లి మధు డిమాండ్ చేశారు. తిరుపతి యశోదా నగర్‌లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పాడి రైతులను అమూల్ డెయిరీ కబ్జా చేయడమే కాకుండా వారి ప్రయోజనాలను దెబ్బతీసేలా విధానాలు ఉన్నాయని విమర్శించారు. అమూల్ డెయిరీని ప్రమోట్ చేస్తే వచ్చే ఆదాయం అహ్మదాబాద్‌కు పోతుంది మినహా మన రాష్ట్రానికి ఒరిగేదేమీలేదన్నారు. సహకార రంగంలో నడుస్తున్న విశాఖ డెయిరీ, విజయవాడలోని విజయ డెయిరీ రైతులకు మేలు చేసేందుకు లీటర్ పై రూ.12 అదనంగా ఇస్తున్నాయని గుర్తు చేశారు. అలాంటి సహకార డెయిరీలను అమూల్‌కు కట్టపెట్టేందుకు ముఖ్యమంత్రి కుట్రలు పన్నారని విమర్శించారు. విజయవాడ విజయ డెయిరీకి రైతులు పాలు పోయనీయకుండా, అమూల్‌కి పోయాలని క్యాంపులు వేసి మరీ జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు, వ్యవసాయ శాఖ ఆర్‌జెడిలు ప్రచారం చేస్తున్నారని ఇది సరికాదని అన్నారు. బిజెపి పాలనలో రాజ్యాంగ వ్యవస్థకే ముప్పు వాటిల్లిందని తెలిపారు. కామన్ సివిల్ కోడ్ ఉమ్మడి పౌరస్మృతి పేరుతో దేశంలో విభజన తెచ్చేందుకు పథకం ప్రకారం బిజెపి పావులు కదుపుతోందని విమర్శించారు. లా కమీషన్ తిరస్కరించినప్పటికీ తిరిగి పట్టు పట్టి పార్లమెంటులో బిల్లు పెట్టడానికి బిజెపి ప్రయత్నించండం దారుణమన్నారు. మీడియా సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి పాల్గొన్నారు.

రాజేష్ మృతదేహాన్ని తీసుకురావాలి

కేంద్ర మంత్రి జయశంకర్‌కు చంద్రబాబు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమెరికాలోని ఫ్లోరిడాలో మృతిచెందిన బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన పొట్టి రాజేష్‌కుమార్ మృత దేహాన్ని ఇంటికి పంపేందుకు సహాయం చేయాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జయ శంకర్‌కు సోమవారం లేఖ రాశారు. ఫ్లోరిడా జాక్సన్ విల్లే బీచ్‌లో తన పిల్లలను రక్షించే ప్రయత్నంలో ఆది వారం రాజేష్ ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఫ్లోరిడాలో రాజేష్ ఉంటా రని వివరించారు. ఆయన భౌతికకాయాన్ని స్వస్థలం తెచ్చేందుకు సహాయపడాలని కేంద్ర మంత్రిని కోరారు.

చిత్తూరు డెయిరీని అమూల్‌కు అప్పగించొద్దు : అచ్చెన్నాయుడు

చిత్తూరు డెయిరీని పునరుద్ధరణ పేరుతో గుజ రాత్‌కు చెందిన అమూల్ కంపెనీకి కట్టబెడుతుండటం దుర్మార్గమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. దశాబ్దాల కాలం నుంచి ఉన్న సహకార వ్యవస్థను మూసివేసేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయని సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. సహకార డెయిరీలతోపాటు మూతపడిన చిత్తూరు డెయిరీని పునరుద్ధరిస్తామని ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. తాడిపత్రి సిఐ ఆత్మహత్యకు కారకులైన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, డిఎస్‌పి గంగయ్యపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య డిజిపికి లేఖ రాశారు.

ప్రకటన
మహారాజశ్రీ విజయవాడ ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఎస్.ఓ.పి.నెం: 9/2023

బిట్వీన్:
జిడ్డు వెంకట మంగ శేషు కుమారి ... పిటిషనర్/వాది
మరియు
నిల్ ... రెస్పాడెంట్/ప్రతివాది

మరణించిన సుద్దపల్లి మంగ నాంచార మల్లికార్జున శర్మకు పిటిషనర్ మాత్రమే చట్టబద్ధమైన వారసురాలు కాబట్టి పిటిషనర్ను గుర్తించి వారసత్వ ధృవీకరణ పత్రం జారీ చేయడం కోసం పై ఎస్.ఓ.పి.నెం:9/2023ని దాఖలు చేసినారున్ని కాబట్టి దీనిపై ఎవరికైనా అభ్యంతరం ఉంటే నేరుగా లేదా వారి తరపున న్యాయవాది గారు గాని శ్రీ కోర్ట్ వారి ఎదుట **14-07-2023**న **ఉదయం 10.30** గంటలకు హాజరుకావాలిని పై గౌరవనీయ న్యాయస్థానం నోటీసు కోసం ఆదేశించింది, హాజరు కానీ పక్షంలో గౌరవనీయమైన శ్రీ కోర్ట్ వారు పిటిషన్ యొక్క మెరిట్‌ల పై నిర్ణయం తీసుకోనగలరు, ఇందుమూలంగా తెలియచేయడమైనది.

Eripilla Rama Kumar,
Gondi Achuta Ram Kumar,
ADVOCATE's
Dr.No.12-7-24, Hayat Khan St.,
Tarapet, Vijayawada- 520 001.
98481 81508, 98481 91508

సంపాదకీయం

బిజెపి 'మహా' కుట్ర

ప్రతిపక్షాలను ధ్వంసం చేయడమే పనిగా పెట్టుకున్న బిజెపి మహారాష్ట్రలో ఎన్‌సిపిని చీల్చిపడేసింది. శాసనసభలో ప్రతిపక్ష నేతగా ఉన్న అజిత్ పవార్, తన అనుచర ఎనిమిది మంది ఎమ్మెల్యేలను వెంటేసుకొని ఉన్నపళంగా ఆదివారంనాడు అధికార శివసేన (ఏక్‌నాథ్ షిండే), బిజెపి సంకీర్ణ ప్రభుత్వం పంచన చేరారు. అలా వచ్చారో లేదో ఇలా అజిత్‌కు కేబినెట్‌లో ఉపముఖ్యమంత్రిగా, తతిమ్మా ఎనిమిది మందిని మంత్రులుగా నియమించారు ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే. వెనువెంటనే రాజ్‌భవన్‌లో గవర్నర్ రమేశ్ బైస్ వారి చేత పదవీ ప్రమాణం చేయించారు. ఉదయం తొమ్మిది గంటలకు అజిత్ నేతృత్వంలో ఎమ్మెల్యేల భేటీ, ప్రతిపక్ష నేత పదవికి అజిత్ రాజీనామా, క్షణాల్లో స్పీకర్ ఆమోదం, ప్రభుత్వంలో చేరిక, ప్రమాణ స్వీకారం... ముందస్తు ప్రణాళిక లేకుండా కొన్ని గంటల్లో ఈ 'రాజకీయ' క్రతువు ఎంతమాత్రం సాధ్యమయ్యే పని కాదు. కేంద్ర బిజెపి కనుసన్నల్లోనే వ్యవహారమంతా నడిచింది. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ ఎన్‌సిపి ఫినిష్ అయిపోతుందని ప్రకటించారు. అంతకుముందు అజిత్ పవార్ కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో సమావేశమయ్యారు. వీటికి కొనసాగింపే అజిత్ ముఠా ఫిరాయింపు.

మహారాష్ట్రలో 2019 అసెంబ్లీ ఎన్నికల తర్వాత గడచిన నాలుగేళ్లలో పార్టీల చీలికలు, ఎమ్మెల్యేల ఫిరాయింపులు డ్రామాలా జరుగుతుండగా వీటికి పక్కా స్క్రిప్టు అందిస్తున్నది మోడీ-షా ద్వయమేనన్నది జగమెరిగిన సత్యం. ఎన్నికలకు ముందు బిజెపి, శివసేన కలిసి పోటీ చేశాయి. సి.ఎం. పదవి విషయంలో విభేదాలు రావడంతో శివసేన దూరం జరిగింది. మెజారిటీ లేనప్పటికీ కేంద్ర బిజెపి సూచనల మేరకు అప్పటి గవర్నర్ తెల్లవారుజామున బిజెపి నేత దేవేంద్ర ఫడ్నవీస్ చేత సి.ఎం.గా ప్రమాణం చేయించారు. అప్పుడే అజిత్ పవార్‌ను దువ్వి ఆయనతో డిప్యూటీ సిఎంగా ప్రమాణం చేయించారు. నాలుగు రోజుల్లోనే శరద్ పవార్ ఒత్తిడి మేరకు అజిత్ వెనక్కొచ్చేశారు. ఫడ్నవీస్ సర్కారు కూలిపోయింది. ఉద్ధవ్ ధాకరే నేతృత్వంలో శివసేన-ఎన్‌సిపి-కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. సహించలేని బిజెపి గతేడాది జూన్‌లో శివసేనను నిట్టనిలువునా చీల్చి ఏక్‌నాథ్ షిండేకు మద్దతిచ్చి సి.ఎం.ను చేసింది. ఏడాదిలో ఇప్పుడు ఎన్‌సిపి ఎమ్మెల్యేల్లో చీలిక పెట్టింది. వాస్తవానికి ఏక్‌నాథ్, బిజెపి ప్రభుత్వానికి మెజార్టీ ఉంది. రానున్న పార్లమెంట్ ఎన్నికలు, ఆపై అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఎన్‌సిపిని బిజెపి చీల్చింది. సి.ఎం.గా పని చేసిన ఫడ్నవీస్ ఏక్‌నాథ్ కేబినెట్‌లో డిప్యూటీ సి.ఎం.గా ఉన్నారు. మరలా అజిత్ కోసం మరో డిప్యూటీ సి.ఎం. పదవిని సృష్టించడం భవిష్యత్ రాజకీయ లబ్ధి కోసమే. కాగా తమ పార్టీ చీలిపోలేదని, కొంత మంది ఎమ్మెల్యేలు మాత్రమే వెళ్లారని, వారిపై చర్యలు తప్పవని ఎన్‌సిపి చీఫ్ శరద్ పవార్ అంటున్నారు.

అధికారం కోసం నానా గడ్డి కరవడం బిజెపికి అలవాటే. ప్రతిపక్ష పార్టీలలో అసంతృప్త నాయకులకు గాలం వేసి ఏదొక రకంగా చేరదీయడం, ప్రభుత్వాలను కూల్చేయడం చూస్తున్నదే. మధ్యప్రదేశ్‌లో, గతంలో కర్ణాటకలో అదే చేసింది. రాజస్థాన్‌లో అటువంటి ప్రయత్నాలే చేస్తోంది. నాలుగేళ్ల నుంచి మహారాష్ట్రలో చేస్తున్నవి అలాంటి కుట్రలే. ప్రభుత్వాల ఏర్పాటులో కేంద్ర దర్యాప్తు సంస్థలు ఇ.డి, సిబిఐ వంటివి పాత్ర పోషించడం బిజెపి నిరంకుశ, ఏకపక్ష రాజకీయాలకు పరాకాష్ట. బిజెపి పంచన చేరిన అజిత్ పవార్‌పై అవినీతి కేసులున్నాయి. ఆయనతో వెళ్లిన ఎమ్మెల్యేలందరూ కేసులెదుర్కొంటున్నవారే. అజిత్ పదవీ కాంక్ష ఉండనే ఉంది. వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఒంటరిపాటు చేసి ఓడించే లక్ష్యంతో మొన్న పాట్నాలో నిర్వహించిన విపక్షాల భేటీలో ఎన్‌సిపి చీఫ్ శరద్ పవార్ కీలకంగా నిలిచారు. ఆ భేటీకి ఆతిథ్యమిచ్చిన నితీష్ సర్కారును అస్థిరపర్చే కుట్రలు చేసి విఫలమైంది బిజెపి. ఇప్పుడు ఎన్‌సిపి ఎమ్మెల్యేలకు ఎర వేసి ఆ పార్టీని ఇబ్బంది పెట్టి భయపెడుతోంది. ప్రజాస్వామ్యాన్ని అంతమొందించేందుకూ బిజెపి వెనుకాడట్లేదు. బిజెపి కుట్రలను ఎదుర్కొని నిలబడటమే పార్టీల ముందున్న సవాల్. ప్రజాస్వామ్య పరిరక్షణే దేశ ప్రజల ముందున్న తక్షణ కర్తవ్యం.

మహనీయుల మాట

ఈ ప్రపంచంలో ఒక వ్యక్తి ప్రత్యేకతను... తన దగ్గర వున్న సంపదను బట్టి కాకుండా... మొత్తం ప్రజల బతుకుల్లో సౌభాగ్యాన్ని నింపడానికి చేసిన కృషిని బట్టి గుర్తించాలి.

- రోబ్ గౌలాండ్,
ఆస్ట్రేలియా కమ్యూనిస్టు పార్టీ సిడ్నీ నగర కమిటీ కార్యదర్శి, రచయిత.

ఎఫ్‌సిఐ వికృత తర్కం

కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం "అన్న భాగ్య" పథకాన్ని జులై 1వ తేదీ నుండి అమలు చేస్తామని ప్రకటించింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రతీ కుటుంబానికీ నెలకు 10 కిలోల చొప్పున బియ్యాన్ని ఉచితంగా అందజేయాలన్నది ఆ పథకం లక్ష్యం. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆ కుటుంబాలకు నెలకు 5 కిలోల చొప్పున బియ్యాన్ని ఉచితంగా అందిస్తోంది. దానికి మరో 5 కిలోలను అదనంగా చేర్చి ఒక కోటి 19 లక్షల మంది నిరుపేదలకు అందించాలన్నది కర్ణాటక ప్రభుత్వం ఉద్దేశ్యం. ఇప్పుడు ఈ పథకం చిక్కుల్లో పడింది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ) కర్ణాటక ప్రభుత్వానికి బియ్యం అమ్మడానికి నిరాకరించింది. కేంద్ర ప్రభుత్వం కరోనా కాలంలో మొదలుపెట్టిన అంత్యోదయ పథకాన్ని ఎత్తివేయాలని కొంతకాలంగా యోచిస్తోంది. కర్ణాటక ప్రభుత్వం గనుక అన్న భాగ్య పథకాన్ని మొదలుపెడితే కేంద్రం అంత్యోదయను కొనసాగించాల్సి వుంటుంది.

ఎఫ్‌సిఐ నిరాకరించిన అనంతరం ఇతర కేంద్ర ఏజన్సీల నుండి గాని, వేరే రాష్ట్రాలనుండి కాని బియ్యాన్ని కొనుగోలు చేయడానికి కర్ణాటక ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. కాని వాటి వద్ద తగినంత నిల్వలు లేవు. పైగా ఆ కేంద్ర ఏజన్సీలు కూడా కర్ణాటకకు బియ్యం అమ్మకుండా కేంద్రం అడ్డు పడవచ్చు. పైగా ఈ విధంగా కొనుగోలు చేయడం వలన బియ్యం ఖరీదు పెరుగుతుంది. స్కీమును అమలు చేయడానికి ఎక్కువ సొమ్ము ఖర్చవుతుంది. రాష్ట్ర బడ్జెట్ మీద అదనపు భారం పడుతుంది.

బిజెపి ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వానికి, ప్రతిపక్ష పాలనలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య ఏదో అరుదుగా జరిగిన ఘర్షణ కాదిది. అధికారాలు విపరీతమైన రీతిలో కేంద్రీకరించబడిన వైనం ఇది. కేవలం రాజకీయ కారణాల కోసం, అందునా, ఒక ప్రతిపక్ష పాలిత ప్రభుత్వం ప్రజాదరణ పొందకుండా ఉండడానికి కేంద్రం చేస్తున్న కుట్ర ఇది. అందుకోసమే ఒక ప్రజానుకూల కార్యక్రమాన్ని చెడగొట్టింది. ఒకపక్క కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఈ అన్న భాగ్య పథకాన్ని అమలు కానీయకుండా అడ్డుపడుతూ వుంటే, మరోపక్క రాష్ట్రంలోని బిజెపి పార్టీ అక్కడ ఏర్పడ్డ కొత్త ప్రభుత్వం ఎన్నికల హామీలనన్నింటినీ అమలు చేయాల్సిందేనంటూ గొంతెత్తి అరుస్తోంది.

రాష్ట్రాలలో ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు చేపట్టినప్పుడు వాటిని కేంద్రం వ్యతిరేకించడం కొత్తేమీ కాదు. గతంలో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆహారధాన్యాలను సబ్సిడీపై ప్రజలకు అందించే పథకాన్ని కుదించి కేవలం పేదవారికే దానిని పరిమితం చేసింది. అప్పటికి కేరళలో సార్వత్రిక ప్రజా పంపిణీ వ్యవస్థ అమలులో ఉంది. ఆ పథకాన్ని కొనసాగించడానికి కేరళ లోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అదనపు బియ్యాన్ని రాష్ట్రంలోనే కొనుగోలు చేసింది. నిజానికి ఎఫ్‌సిఐ కేరళ రాష్ట్రం నుండి లెవీ బియ్యాన్ని సేకరించదు. బియ్యం ఉత్పత్తిలో కేరళ లోటు రాష్ట్రంగా ఉండడమే దానికి కారణం. అయినా, ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఏ మేరకు అదనంగా బియ్యాన్ని రాష్ట్రంలో సేకరించిందో, ఆ మేరకు ఎఫ్‌సిఐ తన సరఫరాను కుదించింది!

అనవసరమైన, అవాంఛనీయమైన కేంద్రీకరణ అనేది కొత్తేమీ కాదు. కాని బిజెపి ప్రభుత్వం ఆ ప్రక్రియను ఇంతకు మునుపెన్నడూ లేనంతగా అమలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ మార్కెట్‌లో కూడా కొనుగోలు చేయడానికి వీలులేని పరిస్థితులను కల్పిస్తోంది. ఈ విధంగా ఒక రాష్ట్ర ప్రభుత్వం పట్ల అనుసరిస్తున్న కక్షపూరిత వైఖరి నిజానికి ఆ రాష్ట్రంలోని పేదలమీద సాగిస్తున్న దాడి అని గ్రహించాలి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రదర్శిస్తున్న వ్యతిరేకత వలన నష్టపోతున్నది పేదలే.

ఎఫ్‌సిఐ కర్ణాటక ప్రభుత్వానికి బియ్యం అమ్మడానికి నిరాకరించడం వెనుక రాజకీయ దురుద్దేశాలేమీ లేవంటూ బిజెపి నాటకం ఆడుతోంది. కాని బియ్యం అమ్మకపోడానికి చెప్తున్న కారణాలు ఏవీ సరైనవి కావు. కేంద్రం వద్ద తగినంతగా బియ్యం నిల్వలు లేనందువలన అమ్మడం సాధ్యపడడం లేదన్నది మొదటి కారణం. మరి అటువంటప్పుడు కొద్ది రోజుల్లోనే 5 లక్షల టన్నుల బియ్యాన్ని, 4 లక్షల టన్నుల గోధుమల్ని అమ్మబోతున్నట్టు ఏ విధంగా ప్రకటించారు? కర్ణాటక ప్రభుత్వం అడిగినది 2.46 లక్షల టన్నుల బియ్యాన్ని మాత్రమే. ఆ మేరకు ఎఫ్‌సిఐ కర్ణాటకకు అమ్మవచ్చు. కాని, ఎఫ్‌సిఐ రాష్ట్ర ప్రభుత్వానికి కాకుండా బియ్యం వ్యాపారులకు అమ్మడానికి సిద్ధమైంది.

కేంద్రం వద్ద తగినంతగా బియ్యం నిల్వలు లేనందువలన అమ్మడం సాధ్యపడడం లేదన్నది మొదటి కారణం. మరి అటువంటప్పుడు కొద్ది రోజుల్లోనే 5 లక్షల టన్నుల బియ్యాన్ని, 4 లక్షల టన్నుల గోధుమల్ని అమ్మబోతున్నట్టు ఏ విధంగా ప్రకటించారు? కర్ణాటక ప్రభుత్వం అడిగినది 2.46 లక్షల టన్నుల బియ్యాన్ని మాత్రమే. ఆ మేరకు ఎఫ్‌సిఐ కర్ణాటకకు అమ్మవచ్చు. కాని, ఎఫ్‌సిఐ రాష్ట్ర ప్రభుత్వానికి కాకుండా బియ్యం వ్యాపారులకు అమ్మడానికి సిద్ధమైంది.

ఎందుకిలా చేస్తోంది? అన్న ప్రశ్నకు చెప్తున్న సమాధానం ఏమిటి? వ్యాపారులకు బియ్యం అమ్మితే దాని వలన మార్కెట్‌లో ధరల పెరుగుదలను అరికట్టడం వీలౌతుందట. ఎఫ్‌సిఐ చైర్మన్ మీడియా ముందు చాలా స్పష్టంగా ఈ విషయాన్ని ప్రకటించారు. బహిరంగంగా బియ్యాన్ని మార్కెట్‌లో అమ్మడం వలన ఆహారధాన్యాల ధరలు మార్కెట్‌లో తగ్గుతాయని చెప్పారు.

ఇది చాలా వికృతమైన వాదన. ఆహారధాన్యాల ధరల పెరుగుదలకు కారణం వాటి డిమాండ్ పెరగడమే వాస్తవం అయితే అప్పుడు ప్రభుత్వమే నేరుగా ఆహారధాన్యాలను వినియోగదారులకు అందించడం వల్ల మార్కెట్‌లో డిమాండ్ తగ్గి ధరలు తగ్గుతాయి. అదే వ్యాపారులకు ఆహారధాన్యాలను అమ్మితే వారు వాటిని వెంటనే మార్కెట్‌లో అమ్మకానికి పెడతారన్న గ్యారంటీ ఏమీ లేదు. వారు వాటిని నిల్వచేయవచ్చు. అప్పుడు ఆహారధాన్యాల ధరలు తగ్గవు. అదే ఆహారధాన్యాలను గనుక రాష్ట్ర ప్రభుత్వాలకు విడుదల చేస్తే అవి నేరుగా ప్రజలకు చేరుతాయి. అప్పుడు ధరలు తగ్గుతాయి.

1972లో కూడా ఇదేమాదిరిగా జరిగింది. అప్పుడు పంటలు దెబ్బతిన్నాయి. అందువలన ఆహారధాన్యాలకు కొరత ఏర్పడవచ్చునన్న అంచనాతో వాటి ధరలను బాగా పెంచివేశారు. అప్పటి ప్రభుత్వం దగ్గర నిల్వలు సరిపడా ఉన్నాయి. అప్పుడు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం విడుదల చేసివుంటే, ప్రజానీకంలో గణనీయమైన భాగం బహిరంగ మార్కెట్‌కు రాకుండా దూరంగా ఉండేవారు. దానివలన బహిరంగ మార్కెట్‌లో బియ్యం డిమాండ్ తగ్గివుండేది. కాని ఇందిరాగాంధీ ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేయడానికి బదులు ఆ నిల్వలను బహిరంగ మార్కెట్‌లో అమ్మడానికి పూనుకుంది. బియ్యం వ్యాపారులు మహదానందంగా నిల్వలను అన్నింటినీ కొనుగోలు చేసి దాచిపెట్టారు. దాంతో ద్రవ్యోల్బణం యథాతథంగా కొనసాగింది.

అది జరిగి యాభై సంవత్సరాలు గడిచిపోయాయి. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం మళ్ళీ అదే పొరపాటు చేయడానికి సిద్ధపడుతోంది. ఇక్కడ మరో వాదన రావచ్చు. కర్ణాటక ప్రభుత్వ స్కీము వలన పేదలకు మరో 5 కిలోల బియ్యం అదనంగా లభిస్తుంది. అదనపు బియ్యాన్ని వాళ్ళు అదనంగా వినియోగిస్తారు. అంతే తప్ప బహిరంగ మార్కెట్‌లో బియ్యం డిమాండ్ ఏమీ తగ్గదు. అందుచేత ధరలు తగ్గవు.- ఇదే ఆ వాదన.

ఈ వాదన రెండు కారణాల రీత్యా తప్పు. మొదటిది: ఈ స్కీము వలన ప్రయోజనం పొందేవారు 4.42 కోట్ల మంది. వీరంతా తమ వినియోగాన్ని పెంచుతారే తప్ప బహిరంగ మార్కెట్ నుంచి చేసే కొనుగోళ్ళను తగ్గించరు అని భావించడం వాస్తవికత అనిపించుకోదు. ఎంతో కొంతమేరకు బహిరంగ మార్కెట్‌లో ఈ స్కీము వలన బియ్యం డిమాండ్ తగ్గుతుంది.

ఆహారధాన్యాల ధరల పెరుగుదలకు కారణం వాటి డిమాండ్ పెరగడమే వాస్తవం అయితే అప్పుడు ప్రభుత్వమే నేరుగా ఆహారధాన్యాలను వినియోగదారులకు అందించడం వల్ల మార్కెట్‌లో డిమాండ్ తగ్గి ధరలు తగ్గుతాయి. అదే వ్యాపారులకు ఆహారధాన్యాలను అమ్మితే వారు వాటిని వెంటనే మార్కెట్‌లో అమ్మకానికి పెడతారన్న గ్యారంటీ ఏమీ లేదు.

రెండవది: మనం ద్రవ్యోల్బణం గురించి ఎందుకు ఆందోళన చెందుతాం? అది పేదలను తక్కిన తరగతుల ప్రజలకన్నా ఎక్కువగా బాధిస్తుంది కనుక. దాని ఫలితంగా వారి వినియోగం తగ్గుతుంది కనుక. ఇప్పుడు ఈ స్కీము ద్వారా వారి వినియోగాన్ని నేరుగా పెంచడం సాధ్యపడుతోంది కదా. అటువంటప్పుడు ద్రవ్యోల్బణం తగ్గడం అనేదానికి పెద్ద ప్రాధాన్యత ఏముంటుంది? ఒకవైపు భారతదేశం ఆకలి సూచికలో వందవ స్థానంలో ఉన్నా, పేదల ఆకలి తీర్చడం కన్నా ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికే ప్రాధాన్యత ఇవ్వడం అంటే ప్రభుత్వం ప్రాధాన్యతలే తప్పు అనుకోవాలి.

అందుచేత బిజెపి ప్రభుత్వం ధరలను తగ్గించడ గురించి మాట్లాడుతున్నది కర్ణాటకకు బియ్యం అమ్మకపోవడాన్ని సమర్థించుకోడానికే. దీనిని క్షమించకూడదు. తన స్వార్థ రాజకీయాల కోసం పేదల బతుకులతో బిజెపి ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది. ఈ కేంద్ర ప్రభుత్వానికి నిజంగానే ఆహారధాన్యాల ధరలను తగ్గించాలన్న నిశ్చయం ఉంది అనుకుంటే అప్పుడు రాష్ట్రానికి నేరుగా బియ్యాన్ని అమ్మాలే తప్ప వ్యాపారులకు కాదు.

ఆహారధాన్యాల పంపిణీని కేంద్రీకృతం చేయడం వలన మొత్తం దేశ ఆహార వ్యవస్థకే దెబ్బ తగులుతుంది. ప్రతిపక్ష పాలనలో ఉన్న రాష్ట్రాలు ఎఫ్‌సిఐని పక్కన పెట్టి నేరుగా ఆహారధాన్యాల సేకరణకు పూనుకుంటే అప్పుడు జాతీయ ప్రజాపంపిణీ వ్యవస్థ మొత్తం దెబ్బతినిపోతుంది.

అలా దెబ్బ తినిపోతే దానికి బిజెపి నుంచి పెద్దగా అభ్యంతరం ఉండకపోవచ్చు. ఎందుకంటే ఆ పార్టీకి ప్రజల అవసరాలేమీ పట్టవు. నిజానికి ఆ పార్టీ ముందుకు తెచ్చిన నల్ల వ్యవసాయ చట్టాలు గనుక అమలులోకి వచ్చి వుంటే ప్రజాపంపిణీ వ్యవస్థ పూర్తిగా దెబ్బ తినిపోయి వుండేది. కాని జాతీయ ప్రజాపంపిణీ వ్యవస్థ దెబ్బ తింటే దానివలన నష్టపోయేది యావత్తు దేశమే.

(స్వేచ్ఛానుసరణ)

ప్రభాత్ పట్నాయక్

★

పోలవరం పునరావాసం కోసం...

సందర్భం

పోలవరం ప్రాజెక్టు చాలా సంవత్సరాల నుండి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రధాన ఎజెండాగా వుంది. ఇది బహుళార్థక సాధక ప్రాజెక్టు అని సాగునీరు, తాగునీరు, విద్యుత్ ఉత్పత్తికి తద్వారా రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని ప్రచారం చేశారు. ప్రాజెక్టుని మా హయాంలో పూర్తిచేస్తామంటే మా హయాంలో ప్రారంభిస్తామని గొప్పలకు పోయి మరీ మాట్లాడడం మనం చూస్తున్నాం. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వాలు, ప్రధాన ప్రతిపక్షాలు చెప్పింది చెబుతున్నది....ప్రాజెక్టు ఎత్తు, పొడవు, వాలు, డ్యామ్ నిధులు...వీటి గురించే. కానీ నేడు చర్చించాల్సింది సర్వం త్యాగం చేసిన నిర్వాసితుల గురించి.

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని సి.పి.యం ఆధ్వర్యంలో జూన్ 20వ తేదీ నుండి జులై 4 వరకు చేపట్టిన 'మహా పాదయాత్ర' గ్రామాల సరిహద్దులు దాటుకుంటూ చైతన్య పరుస్తూ నేడు విజయవాడకు చేరనుంది.

ప్రభుత్వ లెక్కల ప్రకారమే 8 మండలాలు, 222 పంచాయతీలు, 373 గ్రామాలు, 1,06,000 కుటుంబాలు నీట మునుగుతాయి. లక్షల జనాభా నీట మునిగి ఆస్తులు, సంపద పోగొట్టుకుంటున్నా వీరి సంక్షేమాన్ని, పునరావాసాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం అత్యంత విషాదం. 2018 డి.పి.ఆర్. ప్రకారం ప్రాజెక్టు ఖర్చు రూ. 55.656 కోట్లు. ఇందులో పునరావాసం కోసం ఖర్చు చేయాల్సింది రూ. 33,000 కోట్లు కానీ ఖర్చు చేసింది రూ. 7000 కోట్లు మాత్రమే. ఎక్కువ శాతం నిర్మాణానికే ఖర్చు చేస్తున్నారు. మరి నిర్వాసితుల సంగతేంటి? సర్వస్వం త్యాగం చేసిన గిరిజనులు, అడవి బిడ్డల పరిస్థితి ఏంటి? అందుకే పునరావాసం పూర్తయిన తరువాతే ప్రాజెక్టు కట్టాలి.

పోలవరం ప్రాజెక్టు ద్వారా చాలా ప్రయోజనాలు చేకూరతాయనేది ఎంత వాస్తవమో నిర్వాసితులు నష్టపోతారన్నది అంతే నిజం. 2013 భూసేకరణ చట్టం ప్రకారం 25 రకాల మౌలిక వసతులు కల్పించాలి. కానీ అవెక్కడా నిర్వాసితుల కాలనీల్లో కనిపించవు. ఏ నిర్వాసిత కాలనీలో కూడా శ్మశానవాటికలు కనిపించవు. బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం నిర్వాసిత కాలనీల్లో అధ్వాన పరిస్థితులున్నాయి. ఇళ్ళ శ్లాబులు వర్షం వస్తే కారిపోతున్నాయి. నిర్మాణ సంస్థలు కాసుల కక్కుర్తితో నాణ్యత లేకుండా నిర్మించాయి. విద్య, వైద్యం సదుపాయాలు లేవు. గడప గడపకు వైసిపి పేరుతో గత కొంత కాలంగా హడావుడి చేస్తున్నారు. కానీ రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, పోలవరం ఎమ్మెల్యే బాలరాజు నిర్వాసిత కాలనీల్లో అడుగు పెట్టడం లేదు. ఈ గడపలకు ఎందుకు రావడం లేదు. నిర్వాసితులు నిలదీస్తారని భయమా?

ప్రతి సంవత్సరం వరద వస్తుంది. 2022 జులై నెలలో వచ్చిన వరద వేరు. ఇది పాలకుల నిర్లక్ష్యం కారణంగా వచ్చిన వరద. కాంటూరు లెక్కలన్నీ తప్పని ఈ వరదలతో తేలిపోయింది. కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా వరద ప్రాంతాలను ముంపు ప్రాంతాల జాబితాలోకి చేర్చాలని ప్రజలు కోరుతున్నారు. వరదలో పశువులు కొట్టుకుపోయాయి. పంటపొలాలు మునిగిపోయాయి. 33 రోజులు ఎందరో ఇళ్ళు నానిపోయి పడిపోయాయి. విలువైన వస్తువులు పాడైపోయాయి. ఇంత నష్టం జరిగితే ప్రభుత్వం నుండి అందిన సహాయం రూ.2 వేలు మాత్రమే. ఇళ్ళు కూలిపోయినవారికి రూ.10 వేలు అందించారు. అది కూడా అరకొరగానే అందించారు. అందులోను రేకుల షెడ్డుకి ఇవ్వలేదు.

ముంపు గ్రామాల ప్రజల కష్టాలు ఇలా ఉంటే ఊళ్ల ఖాళీ చేసి వచ్చిన నిర్వాసిత కాలనీలో బతుకుతున్న గిరిజనుల పరిస్థితి ఘోరంగా తయారైంది. వారు నిర్వాసిత కాలనీలకు వచ్చి 2 సంవత్సరాలైంది. రావాల్సిన ప్యాకేజీ డబ్బులు ఇంకా రాలేదు. కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. 'చూస్తాం ప్రభుత్వం ప్యాకేజీ డబ్బులు ఇవ్వకుంటే మరలా తిరిగి మా గ్రామాలకు వెళ్ళిపోతాం. పరిహారం ఇస్తుందో, మమ్మల్ని గోదారిలో ముంచేస్తుందో ప్రభుత్వమే తేల్చుకుంటుంద'ని ఆవేదన చెందుతున్నారు.

సాధారణంగా తుఫాన్లు సముద్రాల్లో పుడతాయి. కానీ ప్రభుత్వం నిర్వాసితుల పట్ల ఇదే వైఖరి కొనసాగిస్తే, వదిలేస్తే, ఉదాసీనత ఇలాగే కొనసాగితే తుఫాన్ పుట్టేది సముద్రంలో కాదు. గోదారి నదిలో. ఆ తుఫాన్ పేరు నిర్వాసితుల ఉద్యమం. ఈ తుఫాన్ ప్రజల్ని ఐక్యం చేసి పాలకులను వణికించి అమరావతి దగ్గర తీరం దాటుతుంది జాగ్రత్త. ఇది హెచ్చరిక కాదు. వాస్తవం. గిరిజనులే కదా అణచివేద్దాం, తొక్కేద్దాం అంటే కుదరదు. ఎందుకంటే ఇది చరిత్ర. ఇదే గిరిజనులకు ప్రభుత్వ పెత్తందారులకి జరుగుతున్న అసలైన వర్గపోరాటం. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు అండగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వై. రాము

(వ్యాసకర్త డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు)

★

నివాళి

విప్లవ వీరుడు అల్లూరి

పిన్న వయస్సులో
దేశభక్తి కల్గివుండటం
దేశ పరిస్థితులను
అధ్యయనం చేయటం
అన్ని ప్రదేశాల్లో తిరగటం
పరిస్థితులను
అర్థం చేసుకోవటం
గిరిజనుల కష్టాలను చూసి
చలించిపోవటం
స్వాతంత్ర్య పోరాటానికి
మార్గదర్శి కావటం
విల్లు బాణాలు
చేపట్టేలా చూడటం
గెరిల్లా విద్య నేర్పటం
బ్రిటిష్ దౌర్జన్యాలను
అరికట్టడం
పోలీస్ స్టేషన్లను
ఒకేసారి ముట్టడించడం
మిరపకాయ టపా
పంపించడం
ఒకే రోజు ఒకే సమయంలో
పోలీసు స్టేషన్లపై
మెరుపు దాడి చేయటం
అన్నింట్లో ఒకే ఒక్కడు
అతడే విప్లవ వీరుడు
అల్లూరి సీతారామరాజు
జోహార్ అల్లూరి జోహార్.

- గాదిరాజు రంగరాజు
సెల్ : 8790122275

నేడు అల్లూరి సీతారామరాజు జయంతి

పద పద.. చావో రేవో తేల్చేద్దాం...

పదపద పదపద మనదొకటే మాటై.../ పదపద పదపద పోరాట బాటై / పదపద పదపద చావో రేవో తేల్చేద్దాం/ పదపద పదపద పాదయాత్రలో అడుగేద్దాం...అని ఎలుగెత్తి చాటుతూ పోలవరం నిర్వాసితుల పోరుకేక మహా పాదయాత్రలో అగ్రభాగాన నిలిచారు ప్రజానాట్యమండలి కళాకారులు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం, ఏలూరు జిల్లాల నుండి మొత్తం 30 మంది కళాకారులు పోలవరం నిర్వాసితుల పాదయాత్రకు నూతనోత్తేజాన్ని కలిగిస్తూ ఆద్యంతం ఉత్సాహాన్ని నింపారు. వందలాది కిలోమీటర్ల దూరం ఆట పాటలతో అలరించారు ఈ కళాకారులు. వీరిలో అత్యధికులు నిర్వాసితులు. అన్నింటినీ మించి అందరూ ఆదివాసీ యువత కావడం విశేషం. జూన్ 20న ప్రారంభమైన పోలవరం నిర్వాసితుల పోరుకేక మహా పాదయాత్ర బృందంతో కలిసి అడుగేస్తూ డప్పుల చప్పుళ్లతో, రేలా ఆట పాటలతో, నృత్యాలతో పోలవరం నిర్వాసితుల గొంతుకయ్యారు. ఈ పాదయాత్రకు సన్నాహకంగా...నిర్వాసితుల కష్టాలను, కన్నీళ్లను కళ్ళకు కట్టినట్లుగా ప్రచార గీతాన్ని దేవేంద్ర రచించగా..రవి కళ్యాణ్ సంగీత సారథ్యంలో...వర్ధమాన గాయకుడు రాంకీ ఆలపించారు. ఈ గీతం పాదయాత్రలో ప్రజల్ని ఉర్రూతలూగించిందనడం అతిశయోక్తి కాదు. చింతల యాదగిరి రాసిన-ఉన్న ఊరునీ కన్నతల్లినీ వదిలి పోలేను...పాట మానవత్వం వున్న ప్రతి ఒక్కరినీ కదిలించి కన్నీళ్లు పెట్టించింది. ఆదివాసులం అడవితల్లి బిడ్డలం గోదారి గట్టున ఊగే రేలా పువ్వులం-అంటూ పోలవరం నిర్వాసితుల అస్తిత్వాన్ని తెలియజేసిన అనంగారి భాస్కర్ పాట కూడా నిర్వాసితులను చైతన్యపర్చింది. పోలవరం ప్రాజెక్ట్ పేరుతో ఆదివాసులను అడవికి దూరం చేసి వారి జీవన విధానాన్ని, వైవిధ్యాన్ని, సంస్కృతిని సైతం ధ్వంసం చేస్తారా అంటూ ప్రశ్నించింది. జూన్ 20వ తేదీన జరిగిన మహా పాదయాత్ర ప్రారంభ సభలో 5 పాటలతో పోలవరం పోరుకేక ప్రచార గీత మాలికను తెలంగాణ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలోనే రెండు కేంద్రాలుగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం ఎర్రగట్టు గ్రామంలో, ఏలూరు జిల్లా బుట్టాయిగూడెంలో మూడు రోజులు పాటు 45 మంది కళాకారులతో శిక్షణా శిబిరాలు నిర్వహించింది ప్రజానాట్యమండలి.

ఈ మహా పాదయాత్రలో డప్పుల దళంతో పాటు రెండు జిల్లాల నృత్య దళాలు కీలక పాత్ర పోషించాయి. ప్రధానంగా దేవేంద్ర రచించిన పద పద పద పద పాదయాత్ర అడుగేద్దాం, పోలవరం పులి వేట- గీతాలకు వందల గ్రామాల్లో నృత్యాలు చేశారు. వీరితో పాటు వందలాది మంది పాదయాత్ర బృందం, నిర్వాసిత గ్రామాల ప్రజలు నూతనత్వం సంతరించుకున్న రేలా డిజే పాటలతో అడుగులు వేస్తూ ఒక జాతర వాతావరణంతో ముందుకు సాగారు. పాదయాత్రకు ప్రతి గ్రామంలోను గిరిజన సంప్రదాయ నృత్యాలతో మహిళలు హారతులిస్తూ ఘన స్వాగతం పలికారు. కొన్ని చోట్ల తీన్మార్ బృందాలు కూడా హోరెత్తించాయి. నెల్లిపాకలో మొదలై కూనవరం, చింతూరు, వరరామచంద్రపురం, వేలేరుపాడు, కుకునూరు, జీలుగుమిల్లి, బుట్టాయి గూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లోని ప్రతి నిర్వాసిత గూడెం పర్యటిస్తూ వందలాది కిలోమీటర్ల పాదయాత్రలో అలుపన్నది లేకుండా ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మంగరాజు, అనిల్ సారథ్యంలో కళాకారులు ముందుకు సాగారు. పాదయాత్ర సాంస్కృతిక కార్యక్రమాలకు మంతెన సీతారాం గైడ్‌గా వ్యవహరించారు.

ఉమ్మడి సాంస్కృతిక జీవన విధానానికి ప్రతీకలు ఆదివాసులు. అడవితో వారిది విడదీయలేని అనుబంధం. ప్రస్తుతం పోలవరం బహుళార్థ సాధక జాతీయ ప్రాజెక్టు పేరుతో లక్షలాది ఎకరాల అడవిని ముంచేస్తూ లక్షలాది ఆదివాసులను కాంక్రీట్ జనారణ్యంలోకి తెచ్చి పెట్టింది ప్రభుత్వం. పునరావాసం కల్పించడంతోనే ప్రభుత్వం చేతులు దులుపుకుంటే ఉపయోగం లేదు. వారి సాంస్కృతిక జీవన విధానాన్ని పునర్నిర్మించే బాధ్యత కూడా ప్రభుత్వానిదే. అడవికి దూరమైన ఆదివాసులు వారి ఆహారపు అలవాట్లుకు, వేటకు, ఆట పాటలకు, ప్రకృతిని పూజించే సంస్కృతికి, ఆచార వ్యవహారాలకు, ఆదివాసుల పండుగలకు కూడా దూరంగా నెట్టివేయబడుతున్నారు. సుమారు 12 రకాల పండుగలు ప్రకృతితో పెనవేసుకుని వుంటాయి. ప్రస్తుత నిర్వాసిత కాలనీల్లో ఈ అవకాశాలు ఏవీ లేవు. నేడు ఆదివాసుల భాష కూడా క్రమంగా అంతరించే ప్రమాదం పొంచి వున్నది. షెడ్యూల్డ్ హక్కులను భంగం వాటిల్లుతున్నది. వారిని కాపాడే బాధ్యత నుండి ప్రభుత్వం క్రమంగా తప్పుకుంటోంది. పునరావాస కాలనీల్లో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, శ్మశానాలు కూడా లేకుండా ఇళ్లు నిర్మించి సరిపెట్టుకుంది ప్రభుత్వం. పోలవరం ప్రాజెక్టు పేరుతో ఆదివాసీల సాంస్కృతిక విధ్వంసానికి పాల్పడింది ప్రభుత్వమే. అందుకే తిరిగి ఆదివాసుల సంస్కృతిని పునర్ నిర్మించే బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలి.

పి. మంగరాజు

(వ్యాసకర్త ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు)

★

ఐఐఎస్‌సి ప్రతిష్టను దెబ్బతీయొద్దు

- ఉపాపై చర్చ రద్దును నిరసిస్తూ 500మందికి పైగా శాస్త్రవేత్తలు, విద్యా ప్రముఖుల లేఖ

న్యూఢిల్లీ : క్రూరమైన చట్ట విరుద్ధ కార్యకలాపాల (నిరోధక) చట్టం (యుఎపిఎ- ఉపా)పై చర్చను నిలిపివేయాలని తీసుకున్న నిర్ణయం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఐఐఎస్‌సి) ప్రతిష్టను మసకబార్చేలా ఉందని శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 500మందికి పైగా శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, ఇతర ప్రముఖులు ఈ మేరకు ఐఐఎస్‌సి డైరక్టర్ గోవిందన్ రంగరాజన్‌కు సోమవారం ఒక లేఖ రాశారు. " యుఎపిఎ చట్టం, జైళ్ళు, క్రిమినల్ జస్టిస్ వ్యవస్థ" అన్న శీర్షికతో జూన్ 28న నటాషా నర్వాల్, దేవాంగన కలితల నేతృత్వంలో చర్చ జరగాల్సి వుంది. నర్వాల్, కలితలు విద్యార్థి కార్యకర్తలు, ఢిల్లీ అల్లర్ల కుట్ర కేసులో వారిని నిందితులుగా పేర్కొన్న ఢిల్లీ పోలీసులు యుఎపిఎ కింద వారిపై కేసు బనాయించారు. సెంటర్ ఫర్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ (సిసిఇ)లో జూన్ 27న జరగాల్సిన ఆ చర్చా కార్యక్రమాన్ని ఐఐఎస్‌సి రిజిస్ట్రార్ అర్థంతరంగా రద్దు చేశారు. దాంతో సర్వామ్ కాంప్లెక్స్ వెలుపల ఇష్టాగోష్ఠి నిర్వహించాలని విద్యార్థులైన ఆ నిర్వాహకులు నిర్ణయించారు. వారిని చెదరగొట్టేందుకు భద్రతా బృందాలు వచ్చాయి. చివరకు ఫ్యాకల్టీ సభ్యులు జోక్యం చేసుకోవడంతో భద్రతా బృందాలు వెనక్కి మళ్లాయి.

చెల్లా రాజన్

మహాలక్ష్మి రామకృష్ణన్

నర్వాల్, కలితలకు ఢిల్లీ హైకోర్టు బెయిల్ మంజూరు చేస్తూ, అసమ్మతిని అణచి వేసే ఆతృతలో రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ పరంగా సంక్ర మించిన నిరసనల హక్కుకు, తీవ్రవాద కార్యకలాపాలకు మధ్య గల రేఖను చెరిపేసిందని వ్యాఖ్యానించింది. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని వ్యాఖ్యానించిన విషయాన్ని వారు ఆ లేఖలో గుర్తు చేశారు. నర్వాల్, కలితల అనుభవం వినడం ఐఐఎస్‌సి సభ్యులకు ముఖ్యమైనదని తాము విశ్వసిస్తున్నట్లు శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు పేర్కొన్నారు. ఇతరుల దృక్పథంతో సంబంధం లేకుండా దీనిపై చర్చ జరగడం ప్రజాస్వామ్యంలో చాలా కీలకమని వారు అభిప్రాయపడ్డారు. రాజ్యాంగబద్ధమైన ప్రశ్నలపై శాంతియుతంగా జరిగే చర్చలనే అనుమతించడానికి సంస్థ విముఖంగా వున్నట్లైతే ఇక శాస్త్రీయ దృక్పథానికి అవసరమైన కీలక విచారణా స్ఫూర్తిని ఎలా అమలు చేయగలరని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగపరమైన అంశాలపై శాంతియుత చర్చను అనుమతించడానికి కూడా ఐఐఎస్‌సి సుముఖత చూపకపోతే శాస్త్రీయ దృక్పథంతో పనిచేసేందుకు అవసరమైన విమర్శనాత్మక పరిశీలన స్ఫూర్తిని ఎలా పెంపొందిస్తారని వారు ఆ లేఖలో సూటిగా ప్రశ్నించారు. చర్చను రద్దు చేయడం ద్వారా ఐఐఎస్‌సి పేరు ప్రతిష్టలను పాలనా విభాగం దెబ్బతీసిందన్నారు. ఈ లేఖపై సంతకం చేసిన ప్రముఖుల్లో ఐఐఎస్‌సి ఫ్యాకల్టీ సభ్యులే గాక వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఉన్నారు. వారిలో ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ థియోరిటికల్ సైన్సెస్ ఫ్యాకల్టీకి చెందిన సువ్రత రాజు, సమృద్ధి శంకర్ రే, చెన్నైలోని మేథమేటికల్ ఇనిస్టిట్యూట్ ఫ్యాకల్టీకి చెందిన అలోక్ లద్దా, ఐఐటి కాన్పూర్ ఫ్యాకల్టీకి చెందిన రాహుల్ వర్మన్, మొహాలిలోని ఐఐఎస్‌సి ఫ్యాకల్టీకి చెందిన వైభవ్ వేష్, జెఎన్‌యు ఫ్యాకల్టీకి చెందిన మహాలక్ష్మి రామకృష్ణన్, ఐఐటి మద్రాస్ ఫ్యాకల్టీకి చెందిన చెల్లా రాజన్, ఐఐటి ఢిల్లీ ఫ్యాకల్టీకి చెందిన సిమోనా సాహ్నీ తదితరులున్నారు.

మనీష్ సిసోడియా బెయిల్ పిటీషన్ తిరస్కరణ

న్యూఢిల్లీ : ఇడి నమోదు చేసిన మనీలాండరింగ్ కేసులో ఆప్ నాయకుడు, ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా దాఖలు చేసిన బెయిల్ పిటీషన్‌ను ఢిల్లీ హైకోర్టు సోమవారం తిరస్కరించింది. సిసోడియా పిటీషన్‌ను తిరస్కరించిన జస్టిస్ దినేష్ కుమార్ శర్మ ఈ దశలో బెయిల్ ఇచ్చే అవకాశం లేదని తెలిపారు. సిసోడియాతోపాటు ఈ కేసులో సహ నిందితులుగా ఉన్న వ్యాపారవేత్తలు అభిషేక్ బోయిన్‌పల్లి, బెనోయ్‌బాబు, విజయ్ నాయర్‌ల బెయిల్ పిటిషన్లను కూడా హైకోర్టు తిరస్కరించింది.

'సుప్రీం'లో డిజిటలైజేషన్

- వైఫై సదుపాయం, పేపర్‌లెస్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ అత్యున్నత న్యాయస్థానం కార్యకలాపాల్లో ఇటీవల కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సుప్రీంకోర్టులో డిజిటలైజేషన్ దిశగా మరో ముందడుగు పడింది. సోమవారం నుంచి మూడు కోర్టులు పూర్తిగా పేపర్‌లెస్ గ్రీన్ హైటెక్ విధానాన్ని అమలు చేయనున్నాయి. 73 ఏళ్ల చరిత్రలో న్యాయవ్యవస్థలో పూర్తిగా పేపర్‌లెస్‌గా మారడం ఇదే తొలిసారి కావడం విశేషం. కోర్టు హాల్‌లో సైతం గత 50 ఏళ్ల సుప్రీంకోర్టు తీర్పు కాపీలను తొలగించనున్నారు. అన్ని ఫైళ్లనూ డిజిటల్ మాధ్యమాల ద్వారా చూసే వెసులుబాటు కల్పించనున్నారు. అలాగే సర్వోన్నత న్యాయస్థానంలో ఉచిత వైఫై సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ దీనిపై ప్రకటన చేశారు. సుప్రీంకోర్టులోని ఐదు కోర్టు గదుల్లో ఉచిత వైఫై అందుబాటులోకి తీసుకొచ్చామని, బార్ రూముల్లోనూ ఈ సదుపాయం ఉందని అన్నారు. త్వరలోనే అన్ని కోర్టు గదులకు ఈ సేవలను విస్తరిస్తామని, డిజిటలైజేషన్ దిశగా ఇదో కీలక ముందడుగు పడిందని తెలిపారు. ఆరు వారాల వేసవి సెలవులను ముగించుకుని సుప్రీం కోర్టు సోమవారమే పున్ణప్రారంభమైంది.

సెమీ క్రయోజనిక్ ఇంజన్ పరీక్ష రద్దు

బెంగళూరు : సెమీ క్రయోజనిక్ ఇంజన్ ఇంటర్మీడియల్ కాన్ఫిగరేషన్‌పై నిర్వహించాల్సిన మొదటి హాట్ టెస్ట్‌ను ఇస్రో రద్దు చేసింది. టర్బైన్ ఒత్తిడి అనూహ్యంగా పెరగడం, ఆ వెంటనే టర్బైన్ వేగం తగ్గిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. భవిష్యత్తులో ప్రయోగించే వాహక నౌకల బూస్టర్ దశల కోసం సెమీ క్రయోజనిక్ ఇంజను రెండు వేల కిలోన్యూటన్‌ల వేగాన్ని అందుకునే దిశగా తమిళనాడులోని మహేంద్రగిరిలో ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్ (ఐపిఆర్‌సి)లో ఈ నెల 1న పరీక్ష నిర్వహించినట్లు ఇస్రో సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. కేవలం 4.5సెకన్ల వ్యవధిలోనే హాట్ ఫైరింగ్‌ను అమలు చేయడం ద్వారా గ్యాస్ జనరేటర్, టర్బో పంపులు, ప్రీ బర్నర్, కంట్రోల్ భాగాలు వంటి కీలకమైన ఉప వ్యవస్థల సమగ్ర పనితీరును అంచనా వేయడం ఈ పరీక్ష లక్ష్యంగా వుంది. 1.9 సెకన్ల వరకు అనుకున్నట్లుగానే పరీక్ష సాగింది, కానీ 2 సెకన్ల వద్ద ఒక్కసారిగా టర్బైన్‌లో ఒత్తిడి పెరిగిపోయిందని, ఫలితంగా టర్బైన్ వేగం తగ్గిపోవడాన్ని గమనించామని, దాంతో ముందు జాగ్రత్త చర్యగా ఆ పరీక్షను రద్దు చేశామని ఇస్రో ఆ ప్రకటనలో పేర్కొంది.

ఆర్థిక వివరాలను ఆన్‌లైన్‌లోనే దాఖలు చేయాలి

- ఇసి ప్రత్యేక పోర్టల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజకీయ పార్టీలు ఆర్థిక వివరాలను ఆన్‌లైన్‌లోనే దాఖలు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అందుకోసం ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్ తీసుకొచ్చింది. ఇకపై ఎప్పుడు ఎన్నికలు జరిగినా రాజకీయ పార్టీలు ఆన్‌లైన్‌లోనే తమ ఆర్థిక ఖాతాలను ఫైల్ చేయాలని ఇసి సూచించింది. ఈ మేరకు సోమవారం రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం లేఖ రాసింది. రాజకీయ పార్టీల ఆదాయ, వ్యయాలకు సంబంధించి మూడు రకాల నివేదికలు దాఖలు చేయాలని ఎన్నికల కమిషన్ తెలిపింది. తద్వారా సకాలంలో రాజకీయ పార్టీల కాంట్రిబ్యూషన్ రిపోర్ట్, ఆడిట్ చేసిన ఖాతాల వివరాలను తెలుసుకునేందుకు వీలుంటుందని ఇసి భావిస్తోంది. దీనికి సంబంధించి ఇసి సోమవారం ప్రకటన విడుదల చేసింది. 1951 ఎన్నికల కమిషన్ ప్రాతినిధ్య చట్టం ప్రకారం మార్గదర్శకాలను అనుసరించి రాజకీయ పార్టీలు ఎప్పటికప్పుడు తమ నివేదికలను సమర్పించాలని కోరింది.

IN THE COURT OF THE HON'BLE V ADDL. DISTRICT JUDGE AT VIJAYAWADA
E.P.No.195/2018 IN A.O.P. No.313/2015

Between:
M/s. Shriram Transport Finance Co. Ltd.,
Rep. by its Authorized Signatory...DHR/Claimant
Vs
1.Seelam Sarveswara Rao
2.Naga Malleswara Rao Kondasetti... JDRs/Respondents

NOTICE TO JDR NO.1&2/ RESPONDENT'S

Seelam Sarveswara Rao, S/o. Venkateswara Rao, D. No. 3-20, Tummalapalem, Vijayawada Rural, NTR District – 521456.
Naga Malleswara Rao Kondasetti, S/o. Subba Rao, D. No. 2-70, Tummalapalem, IBrahimpatnam, NTR District – 521456.
Take notice that the above Execution Petition filed by the DHR/Claimant praying orders against JDR 1&2. The same is posted to **07/07/2023** for your appearance on that day you should attend the court in person or through an advocate at 10.30 A.M. failing which the matter will be decided in your absence by the Hon'ble Court.

(BY ORDER OF THE HON'BLE COURT)
C.V. SUBRAHMANYESWARA RAO, Advocate
Swamy Street, Gandhinagar, Vijayawada – 520003.
Cell No: 9399975668. Mail ID: venkatcsrao@gmail.com

మణిపూర్‌పై సవివరమైన నివేదిక కావాలి

- సుప్రీం ఆదేశాలు
- నెమ్మదిగానైనా పరిస్థితులు మెరుగుపడుతున్నాయన్న రాష్ట్ర ప్రభుత్వం
- 10వ తేదీకి విచారణ వాయిదా

న్యూఢిల్లీ : మణిపూర్‌లో నెమ్మదిగానైనా పరిస్థితులు మెరుగుపడుతున్నాయని రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టులో సోమవారం చెప్పింది. ఆదివారం తాజాగా హింస చెలరేగి మరో నలుగురు మరణించిన నేపథ్యంలో ఈ ప్రభుత్వ ప్రకటన వెలువడింది. క్షేత్ర స్థాయిలో నెలకొన్న వాస్తవిక పరిస్థితులను వివరిస్తూ తాజాగా నివేదికను తదుపరి విచారణ జరిగే 10వ తేదీలోగా దాఖలు చేయాల్సిందిగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. "పునరావాసానికి, ఆయుధాలు రికవరీ చేసుకోవడానికి, శాంతి భద్రతల పరిస్థితులను పునరుద్ధరించడానికి జరుగుతున్న కృషిని తెలుసుకోవాలనుకుంటున్నాం. సవివరమైన నివేదిక మాకు కావాలి." అని చంద్రచూడ్ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు చాలా దారుణంగా వున్నాయని పిటిషనర్ మణిపూర్ గిరిజన వేదిక ఢిల్లీ (ఎంటిఎఫ్‌డి) తరపున సీనియర్ న్యాయవాది కొలిన్ గొంజాల్వెజ్ కోర్టుకు తెలియజేశారు. ఆ నేపథ్యంలో కోర్టు ఆదేశాలు వెలువడ్డాయి. తాజాగా చోటు చేసుకున్న హింసాకాండలో ఒక వ్యక్తి తల నరికివేసినట్లు వార్తలందాయని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ కేసుకు మతం రంగు పులమవద్దని మెహతా పిటిషనర్‌ని కోరారు. "సమస్య పరిష్కారమవుతోంది, పరిస్థితి నెమ్మదిగా అయినా మెరుగుపడుతోంది." అని చెప్పారు. రాష్ట్రంలో గణనీయంగానే రక్షణ, భద్రతా బలగాలు వున్నాయని ప్రభుత్వం వెల్లడించింది. 355 సహాయ శిబిరాలు వున్నాయి. కర్ఫ్యూను ఐదు గంటలకు తగ్గించారని తెలిపింది. ప్రజలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం సుప్రీంకోర్టులో హామీ ఇచ్చినా హింస, హత్యలు కొనసాగుతున్నాయని సోమవారం గొంజాల్వెజ్ పేర్కొన్నారు. కోర్టు ఈ అంశాన్ని విచారణకు చేపట్టినపుడు 20వరకు మరణాలు నమోదవగా, ఇప్పుడు 110మందికిపైగా చనిపోయారని పేర్కొన్నారు. కుకీలకు వ్యతిరేకంగా హింసకు పాల్పడాలన్న తమ ఉద్దేశాన్ని రెండు తీవ్రవాద గ్రూపులు బహిరంగంగానే ప్రకటించినా ఇంతవరకు ఒక్కరినీ అరెస్టు చేయలేదన్నారు.

కృష్ణపట్నం ప్లాంట్ ఉత్పత్తి పెరగాలి

- జెన్‌కోకు ఎపిఇఆర్‌సి ఛైర్మన్ ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కృష్ణపట్నం థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రంపై ప్రత్యేక దృష్టి సారించాలని జెన్‌కో అధికారులను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ఛైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి ఆదేశించారు. అత్యధికంగా విద్యుదుత్పత్తి చేసేందుకు అవసరమైన నాణ్యమైన బొగ్గు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, బొగ్గు రవాణాలో అవరోధాలను అధిగమించాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఎపిఇఆర్‌సి కార్యాలయంలో విద్యుత్‌రంగంపై ఛైర్మన్ సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కృష్ణపట్నం మొదటి దశ ప్లాంట్ ప్రస్తుతం పిఎల్‌ఎఫ్ స్థాయి 61 శాతంగా ఉందని, డిసెంబరు నాటికి 85 శాతానికి పెంచేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని ఛైర్మన్ ఆదేశించారు. తద్వారా విద్యుత్ లభ్యత మెరుగుపడుతుందని, మార్కెట్‌లో ఖరీదైన విద్యుత్‌పై ఆధారపడాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిషన్ ఆదేశాలకు జవాబుదారీగా ఉండే నియంత్రణ కంప్లయన్స్ అధికారిని నియమించాలని డిస్కామ్‌లను ఆదేశించారు. విద్యుత్ సంస్థలు నిరంతరం విద్యుత్ అందించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. ఈ సమావేశంలో ఇఆర్‌సి సభ్యులు పివిఆర్ రెడ్డి, ఠాకూర్ రామసింగ్, జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధరబాబు, డిస్కమ్‌ల సిఎమ్‌డిలు జె పద్మాజనార్ధన రెడ్డి, గ్రిడ్ డైరెక్టర్ కె సంతోషరావు, ఎవికె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బెంగాల్ పంచాయతీ ఎన్నికలు

ప్రతిపక్షాల అభ్యర్థులపై యథేచ్ఛగా దాడులు

- పేట్రేగిపోతున్న తృణమూల్ గూండాలు
- ప్రేక్షక పాత్ర పోషిస్తున్న పోలీసులు

కొల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో మూడంచెల పంచాయతీ రాజ్ ఎన్నికల పోలింగ్ గడువు దగ్గరపడుతున్న కొద్దీ తృణమూల్ గూండాల ఆగడాలు పెరిగిపోతున్నాయి. నామినేషన్ల దాఖలు సమయంలో ప్రతిపక్షాలకు చెందిన అభ్యర్థులను అడ్డుకోడానికి యథేచ్ఛగా బెదిరింపులు, దాడులకు తెగబడిన అధికార తృణమూల్ కాంగ్రెస్, ఎన్నికల ప్రచారాన్ని కూడా హింసాత్మకంగా మార్చేసింది. బెంగాల్‌లోని 20 జిల్లా పరిషత్‌లకు చెందిన 825 జెడ్‌పిటిసిలకు, 341 పంచాయతీ సమితులకు చెందిన 9,240 సమితి మెంబర్ల స్థానాలకు, 3,354 గ్రామ పంచాయతీలకు చెందిన 48,751 వార్డు స్థానాలకు ఈ నెల8న ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. ఫలితాలు 11న వెలువడతాయి.

ప్రతిపక్ష అభ్యర్థులపై యథేచ్ఛగా దాడులు

ఎన్నికల ప్రచార సందర్భంగా తృణమూల్ దుండగులు సాగిస్తున్న ఎడాపెడా దాడులకు సిపిఐ(ఎం), కాంగ్రెస్ కు చెందిన పలువురు కార్యకర్తలు చనిపోయారు. ఇంకా అనేక మంది గాయపడ్డారు. పశ్చిమ మిడ్నపూర్ జిల్లా సబాంగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బల్పాయ్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఇద్దరు సిపిఐ(ఎం) అభ్యర్థులపై సోమవారం తృణమూల్ దుండగులు బాంబులు, తుపాకులతో దాడి చేశారు. వీధి మీటింగ్ కోసం వేసిన కుర్చీలు, బల్లలను ధ్వంసం చేశారు.. సైకిళ్లను ఎత్తుకుపోయారు. ఈ దాడిలో ఇద్దరు అభ్యర్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారు.

రాయ్‌గంజ్ పంచాయితీలో ఎన్నికల నామినేషన్ వేయకుండా అడ్డుకోడానికి తృణమూల్ బెదిరింపులకు దిగింది. అయినా లెక్కచేయకుండా సిపిఐ(ఎం) అభ్యర్థి మన్సూర్ ఆలం నామినేషన్ వేయడానికి వెళ్తుండగా ఆయన తలకు గురిపెట్టి తృణమూల్ దుండగులు కాల్పుఉ జరిపారు. ఈ దాడిలో గాయపడి గత కొద్ది రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆలం సోమవారం చనిపోయారు. ఈ దాడికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ దస్పుర పోలీస్ అవుట్ పోస్టు ఎదుట రహదారిపై సిపిఎం కార్యకర్తలు ఆందోళనకు దిగారు. వారం రోజుల్లో నిందితులను పట్టుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఉత్తర 24 పరగణాల జిల్లా హరోవాలో సోమవారం తెల్లవారు జామున జరిగిన బాంబు పేలుడులో ఒకరు మరణించారు. పొలంలో బాంబులు తయారు చేస్తుండగా అవి పేలడంతో ఒకరు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. తృణమూల్ కాంగ్రెస్‌లోని ముఠా ఆధిపత్య పోరులో భాగంగానే బాంబులు తయారు చేస్తున్నారని కుటుంబ సభ్యులు చెప్పినట్లు పోలీసులు తెలిపారు.

ఇదిలా వుండగా తూర్పు మిడ్నపూర్ జిల్లాలో బిజెపి గూండాలు బెదిరింపులు, మానసిక వేధింపులకు ప్రతిపక్షాలకు చెందిన 74 ఏళ్ల సిపిఎం అభ్యర్థి చనిపోయారు.

బీర్భుమ్ ఎంపి శతాబ్ది రాయ్‌కు నిరసన సెగ

బీర్భుమ్‌కు చెందిన తృణమూల్ ఎంపి శతాబ్ది రాయ్‌కు నిరసన సెగ తగిలింది. సోమవారం ఆమె ప్రయాణిస్తున్న కారును గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వర్షాకాలం వస్తే మురుగు నీటి కాల్వలు పొంగి పొర్లుతూ ఇళ్లల్లోకి వస్తుందని, ఈ విషయమై స్థానిక పంచాయతీ ప్రధాన్‌కు ఎన్ని సార్లు విన్నవించినా ఫలితం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిగా ఎన్నికైన తరువాత ఒక్కసారి కూడా తమ ప్రాంతం వైపు తొంగి చూడని ఎంపీని వారు నిలదీశారు. చాలా కాలంగా శిథిలావస్థలో ఉన్న వంతెన స్థానే కొత్త వంతెన కట్టాలని వారు డిమాండ్ చేశారు.

నేడు షాంఘై కూటమి భేటీ

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొననున్న నేతలు

న్యూఢిల్లీ : మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరగనున్న షాంఘై సహకార కూటమి (ఎస్‌సిఒ) దేశాధినేతల సమావేశానికి భారత్ ఆతిథ్యమిస్తోంది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే ఈ సమావేశంలో రష్యా, చైనా, పాకిస్తాన్ దేశాధినేతలు పాల్గొంటున్నారు. భారత్ ఈ గ్రూపులో సభ్యురాలిగా మారిన తర్వాత మొదటి సారిగా స్వదేశంలో నిర్వహించే ఈ సమావేశం పట్ల అందరూ చాలా ఆసక్తిగా ఎదురుచూశారు. రెండు రోజుల పాటు జరగాల్సిన సమావేశాన్ని ప్రస్తుతం ఒక రోజుకు కుదించారు. అది కూడా మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల పాటు జరగనుంది. ప్రారంభోపన్యాసాలు, తుది ప్రకటనలతోనే చాలా సమయం గడిచిపోతుంది. ఢిల్లీ డిక్లరేషన్‌ను నేతలు విడుదల చేస్తారు. పలు పత్రాలను కూడా విడుదల చేయనున్నారు. ఇరాన్ ఎస్‌సిఒ సభ్యురాలిగా చేర్చుకునే అవకాశం వుంది. బెలారస్‌ను చేర్చుకునే క్రమం వచ్చే ఏడాదికి పూర్తికావచ్చు. ఇంగ్లీషును అధికార భాషగా చేసేందుకు చేపట్టిన చొరవను ఆమోదించే అవకాశాలు వున్నాయి. అలాగే సాంప్రదాయ వైద్యంపై నిపుణుల వర్కింగ్ గ్రూపు, స్టార్టప్‌లపై ప్రత్యేక వర్కింగ్ గ్రూపు ఏర్పాటుపై కూడా చర్చ జరగనుంది. తీవ్రవాద నిరోధక కార్యకలాపాల్లో సభ్య దేశాల అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు ఎస్‌సిఒ బేస్‌ను ఏర్పాటు చేయాలన్న చైనా ఆలోచనలపై కూడా చర్చలు జరగవచ్చని భావిస్తున్నారు.

ప్రధాని నివాసంపై ఎగిరిన డ్రోన్!

న్యూఢిల్లీ : సోమవారం ఉదయం ప్రధానమంత్రి నివాసంపై గుర్తు తెలియని వస్తువు ఎగరడంతో భద్రతా సిబ్బంది, పోలీసులు అప్రమత్తమయ్యారు. మధ్య ఢిల్లీలో ఉన్న ప్రధానమంత్రి నివాసంపై ఉదయం 5 గంటల సమయంలో డ్రోన్ వంటి వస్తువు ఎగిరినట్లు సమాచారం వచ్చినట్లు పోలీసులు చెప్పారు. దీంతో పోలీసులు, మిగిలిన భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. గాలింపు చేపట్టారు. వారికి ఎలాంటి అనుమాస్పద వస్తువులు కనిపించలేదు. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌ను కూడా సంప్రదించామని, వారు కూడా ఎలాంటి వస్తువులను గుర్తించలేదని ఢిల్లీ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్‌సిపి రాష్ట్ర అధ్యక్షుడిగా సునీల్ తత్కరే

ముంబయి : మహారాష్ట్రలో తాజాగా చీలిపోయిన అజిత్ పవార్ గ్రూపు నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) రాష్ట్ర అధ్యక్షులుగా లోక్‌సభ ఎంపి సునీల్ తత్కరేను ప్రకటించింది. ఈ విషయాన్ని ఎన్‌సిపి వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రఫుల్ పటేల్ సోమవారం తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీలో ఎన్‌సిపి చీఫ్ విప్‌గా అనిల్ భైదాస్ పాటిల్‌ను నియమించారు. సోమవారం సాయంత్రం సహ్యాద్రి గెస్ట్ హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి అజిత్‌పవార్, సునీల్ తత్కరే, ప్రఫుల్ పటేల్ పాల్గొన్నారు. ఆదివారం ఎన్‌సిపి నిట్టనిలువుగా చీలి అజిత్ పవార్ గ్రూపు ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వంలో చేరిన సంగతి తెలిసిందే. అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రిగానూ, మరో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు.

జెనిన్‌పై ఇజ్రాయిల్ దాడి

(మొదటి పేజీ తరువాయి)

పక్షాలు, అరబ్ పక్షాలు జోక్యం చేసుకోవాల్సిన అవసరం వుందని వారు నొక్కి చెప్పారు. ఇజ్రాయిల్ చర్యను ఇరాన్, ఈజిప్ట్, జోర్డాన్ సహా పలు దేశాలు, అరబ్ లీగ్, ఇస్లామిక్ సహకార సంస్థ (ఓఐసి)లు తీవ్రంగా ఖండించాయి. హేయమైన నేరానికి ఇజ్రాయిల్ పాల్పడిందని ఓఐసి విమర్శించింది. ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది. గాయపడిన వారికి తక్షణమే సాయం అందేలా అవకాశం కల్పించాల్సిందిగా మానవతా కోఆర్డినేటర్ లిన్ హేస్టింగ్స్ ట్వీట్ చేశారు. అంతర్జాతీయ సమాజం చేతులు ముడుచుకుని కూర్చుందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

అనుకున్న ప్రకారమే ఆపరేషన్ కొనసాగుతోందని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి యోవ్ గల్లాంట్ వ్యాఖ్యానించారు. అత్యున్నత మిలటరీ కమాండర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఆపరేషన్ ఎప్పుడు ముగుస్తుందన్నది ఎలాంటి సూచనలు చేయలేదు.

ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటిగంట సమయంలో శరణార్థుల శిబిరంపై దాడి చేయడంతో సైనిక ఆపరేషన్ ప్రారంభమైందని సైనిక ప్రతినిధి తెలిపారు. మొత్తంగా 2వేలమంది సైనికులు ఈ అపరేషన్‌లో పాల్గొన్నారు.

300కోట్ల డాలర్లతో 25కి పైగా స్టెల్త్ జెట్‌లు

300కోట్ల డాలర్ల విలువైన ఒప్పందంలో భాగంగా 25కి పైగా ఎఫ్-35 స్టెల్త్ యుద్ధ విమానాలను కొనుగోలు చేయడానికి ఆమోద ముద్ర లభించినటు ఇజ్రాయల్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. అమెరికాకు వెలుపల ఈ యుద్ధ విమానాలను సమకూర్చుకున్న మొదటి దేశం ఇజ్రాయిల్‌నే. తాజా ఒప్పందంతో ఇజ్రాయిల్ వైమానిక దళంలో ఎఫ్-35 విమానాల సంఖ్య 75కి చేరనుంది. అమెరికా నుండి ఇజ్రాయిల్ అందుకున్న రక్షణ సహాయ ప్యాకేజీ ద్వారా ఈ ఒప్పందానికి నిధులు అందాయని ఇజ్రాయిల్ రక్షణ అధికారులు తెలిపారు.

ఆర్టికల్ 370 రద్దుపై 11న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ : రాజ్యాంగంలోని 370వ అధికరణను రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీం ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ నెల 11న విచారించనుంది. ఈ అధికరణను రద్దు చేయడంతో జమ్ముకాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని కోల్పోయింది. ఫలితంగా 2019లో రాష్ట్రం రెండు ముక్కలైంది. ఈ అంశంపై త్వరగా విచారణ చేపట్టాలంటూ ఫిబ్రవరి 17న పిటిషనర్లు చివరిసారిగా కోరారు. త్వరలోనే విచారణ తేదీని నిర్ణయిస్తామంటూ ఆనాడు చంద్రచూడ్ వారికి హామీ ఇచ్చారు. రెండేళ్లకు పైగా ఈ కేసు సుప్రీంలో పెండింగ్‌లో వుంది. విస్తృత ధర్మాసనానికి పిటిషన్లను నివేదించడానికి ఐదుగురు సభ్యుల ధర్మాసనం 2020 మార్చిలో తిరస్కరించిన తర్వాత ఈ కేసు విచారణకు రాలేదు.

వైఎస్ వివేకా హత్య కేసు విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కృష్ణా రెడ్డి బాధితురాలా? లేక ఫిర్యాదుదారా? దేనికి కాంపిటెంట్ అన్న విషయాన్ని త్వరలోనే నిర్ణయిస్తామని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. వివేకా కేసులో దస్తగిరి అప్రూవర్‌గా మారడాన్ని సవాల్ చేస్తూ శివశంకర్ రెడ్డి, ఎంవి కృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను, ఈ కేసులో తనను బాధితునిగా గుర్తించాలని ఎంవి కృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కృష్ణ మురారి, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం విచారణ జరిపింది. తొలుత ఈ కేసును హైకోర్టుకే పంపుతామని సుప్రీం ధర్మాసనం తెలిపింది. ఈ విషయంపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ పెండింగులో ఉన్నందున ముందు అక్కడ తేల్చుకోవాలని సుప్రీం వెల్లడించింది. ఈ కేసును ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు బదిలీ చేసే సమయంలో వివేకా సతీమణి, కుమార్తెలను బాధితులుగా సుప్రీంకోర్టు గుర్తించింది.

ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ
ఫ్లాట్ నం.18, రోడ్డు నం.6, సెక్టార్ 4, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేడమీద, లోటస్ ల్యాండ్ మార్క్, విజయవాడ-3, ఫోన్ నం.0866 2533455, ఇ మెయిల్ ఐడి : eeapmsidc.krishnadt@gmail.com
టెండర్ నోటీసు నం.04/ఇఇ/ఎపిఎమ్ఎస్ఐడిసి విభాగం/కృష్ణ-జిల్లా/విజెఎ/డిబి/2023-24, తేది:30.06.2023
ఇ-ప్రొక్యూర్మెంట్ ద్వారా పదహారు (16) సంఖ్యల పనులు అనగా.. 1. గుడివాడ వద్ద ఐపిహెచ్‌ఎల్ ల్యాబ్ స్థాపన, 2. విజయవాడ, పాత జిజిహెచ్ వద్ద ఎన్ఐసియు 20 బెడ్లు మరియు ఎస్ఎన్‌సియు 20 బెడ్ల స్థాపన, మరియు 3. కృష్ణాజిల్లాలో పిహెచ్‌సిలు (13 ప్రదేశాలు) వద్ద ఓవర్ 1వ అంతస్తు ప్రీ-ఫాబ్రికేటెడ్ నిర్మాణంతో 6 బెడ్ల వార్డు నిర్మాణం. ఇతర వివరాలకు వెబ్‌సైట్ https://tender.apeprocurement.gov.in లో 05.07.2023, ఉ.10.30 గం. నుండి చూడండి.
సం/- ఎమ్.లింగయ్య నాయుడు, బి.ఇ., కార్యనిర్వాహక ఇంజనీరు.
DIPRNo. 2181PP/CL/ADVT/1/1/2021-22

KLM AXIVA FINVEST LTD
4వ అంతస్తు, డో.నం.1871ఎ24, విఎమ్ ప్లాజా, సివిల్ లైన్ రోడ్డు, పాలరివట్టొం కొచ్చిన్-682025, ఫోన్: 7558865300
వేలం నోటీసు
05.07.2023న దిగువ పేర్కొన్న శాఖల క్రింద తనఖా వస్తువులను క్రమబద్ధమైన పద్ధతిలో వేలం వేయాలని కెవిఎమ్ ఆక్సివ ఫైనవెస్ట్ లిమిటెడ్ నిర్ణయించుకుంది, తిరిగి చెల్లింపు లేదా పునరుద్ధరణకు ఆసక్తిగల వినియోగదారులు వడ్డీతో వేలానికి ముందు సంబంధిత శాఖలలో సంప్రదించగలరు. అయితే, పైన పేర్కొన్న కారణాల వల్ల వేలం విఫలమైతే, ఎలాంటి తదుపరి నోటీసు లేకుండా వేలం నిర్వహించే స్థలానికి వేలం వాయిదా వేయడానికి ఆపరేటర్లకు పూర్తి అధికారం ఉంటుంది. కెవిఎమ్ ఆక్సివ ఫినవెస్ట్ లిమిటెడ్., విఎమ్ ప్లాజా, సివిల్ లైన్ రోడ్డు, పాలరివట్టోమ్. 2వ వేలం తేది మరియు సమయం: 10.07.2023, ఉ.10.00 గం. వేలం ప్రదేశం :1వ అంతస్తు, శ్రీకృష్ణ నిలయం, బ్యాంక్ ఆఫ్ బరోడా పైన, గవర్నర్‌పేట, ఏలూరు రోడ్డు, కృష్ణ, 520002 (కృష్ణాజిల్లా) భవానిపురం 202203980100007 కంకిపాడు 202204100100107 మచిలీపట్నం 202204200100149 202204200100205 202204200100256 పోరంకి 202203990100023 202203990100049 202203990100061 202203990100128 202203990100131ఉయ్యూరు 202203850100049 202203850100055.

హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్. (HDB FINANCIAL SERVICES)
నమోదిత కార్యాలయం: రాధిక, 2వ అంతస్తు, లా గార్డెన్ రోడ్, నవ్‌రంగ్‌పుర, అహ్మదాబాద్-09.
శాఖ కార్యాలయం: # 76-8-10/1, ఫ్లాట్ నెం.4, భవానీ టవర్స్, స్వాతి థియేటర్ రోడ్డు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెనుక, భవానీపురం, విజయవాడ-520012.
అనుబంధం IV - స్వాధీనత నోటీసు
రూల్ 8(1) చూచుట (స్థిరాస్తి కొరకు)
ఏదైతే, మెస్సర్స్. హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారైన దిగువసంతకందారుడు, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ యాక్ట్, 2002 క్రింద మరియు యొక్క సెక్షన్ 13(12) (3) & ఆర్/డబ్ల్యూ రూల్ 8 & 9 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నిబంధనల ప్రకారం 16.02.2023 తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయబడింది. లోను ఎ/సి నం లు. 16191369-10819722, పిలువబడిన దరఖాస్తుదారుడు/సహ-దరఖాస్తుదారులు/హామీదారులు, 1.రవి బిజినెస్ మెషిన్స్, గ్రౌండ్ ఫ్లోర్, 29-2-1/3, రామ మందిరం రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ-520002, ఆంధ్రప్రదేశ్. మరియు ఇక్కడ కూడా : ఎస్.నం.306, మూల్యాంకనం నం.20939 (పాత) 183387 (కొత్త) మున్సిపల్ వార్డు నం.21, రెవెన్యూ, వార్డు 9, బ్లాక్ నం.8, డో.నం.29-2-1, ఆశోక్ హాస్పిటల్, విజయవాడ-520002, ఆంధ్రప్రదేశ్. 2. సజ్జా శ్రీలక్ష్మి, డో.నం.31-16-35, 1వ అంతస్తు, మాచవరం, విజయవాడ, బుల్లమ్మ వీధి, విజయవాడ-520004, ఆంధ్రప్రదేశ్. 3. సజ్జా రవి, డో.నం.31-16-35, 1వ అంతస్తు, మాచవరం, విజయవాడ, బుల్లమ్మ వీధి, విజయవాడ-520004, ఆంధ్రప్రదేశ్. 4. సజ్జా శ్రీలక్ష్మి, డో.నం.29-2-1/3, రామ మందిరం రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ-520002, ఆంధ్రప్రదేశ్, నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించడానికి ఉన్న రూ॥74,27,576/- (డెభై నాలుగు లక్షల ఇరవై ఏడు వేల ఐదు వందల డెభై ఆరు రూపాయలు మాత్రమే) 16.02.2023 నాటికి పేర్కొన్న నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు చెల్లించాలని సదరు నోటీసులో పేర్కొనడం జరిగింది.
దరఖాస్తుదారుడు/సహ-దరఖాస్తుదారులు/హామీదారుడు, మొత్తాన్ని తిరిగిచెల్లించుటలో విఫలమైనారు, దరఖాస్తుదారుడు/సహ-దరఖాస్తుదారులు/హామీదారుడు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా ఆర్/డబ్ల్యూ రూల్ 8 మరియు 9 చదువుతూ సదరు చట్టం సెక్షన్ 13(4) క్రింద అతని అధికారాలను నిర్ణయించి అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థిని 29 జూన్, 2023 వ తేదీన దిగువసంతకందారుడు స్వాధీనపరుచుకున్నాడు. ముఖ్యంగా దరఖాస్తుదారుడు/సహ-దరఖాస్తుదారులు/హామీదారుడు మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడమేమనగా సదరు ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు మెస్సర్స్ హెచ్‌డిబి ఫైనాన్సియల్స్ లిమిటెడ్‌కు 16.02.2023 నాటికి **రూ.74,27,576/- (డెభైనాలుగు లక్షల ఇరవై ఏడు వేల ఐదు వందల డెభై ఆరు రూపాయలు మాత్రమే)** మరియు దానిపిమ్మట వడ్డీ మరియు దానిపై ఛార్జీలు చెల్లించి జరుపవచ్చు. దరఖాస్తుదారుడు/సహ-దరఖాస్తుదారులు/హామీదారుడు జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది.
సెక్యూరిటీలు-1 యొక్క షెడ్యూల్ :
ఆంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా, విజయవాడ, గవర్నర్‌పేట, బ్లాక్ నం.8, రెవెన్యూ వార్డు నం.9, మున్సిపల్ వార్డు నం.21, కొత్త మూల్యాంకనం నం.183387, పాత మూల్యాంకనం నం.20939, ఎన్.టి.ఎస్.నం.306, డో.నం.29-2-1, ఉత్తరం: రామిశెట్టి దుర్గమ్మ మరియు సురత్రి పెద్దగమ్మ రామణమ్మ ఆస్తి, దక్షిణం: సురత్రి కొండలరావు ఆస్తి, తూర్పు: మున్సిపల్ రోడ్డు, పడమర: పోటిబండియ అప్పా రోడ్డు.
తేది: 29.06.2023
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి
హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్. తరపున

यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వ రంగ సంస్థ
ఎనికేపాడు బ్రాంచి : ఎ టి & పోస్టు, ఎనికేపాడు, వయా రామవరప్పాడు , విజయవాడ, కృష్ణా జిల్లా, ఎపి-521108
NOTICE UNDER SECTION 13 (2) OF ACT 54 OF 2002 FOR ENFORCEMENT OF SECURITY INTEREST
డిమాండ్ నోటీసు
టు : ఋణగ్రహీత : శ్రీమతి ఇమ్మిడి శ్రావణి, భర్త : లేటు వెంకట సురేంద్ర శేషసాయి, ఫ్లాట్ నెం. 401, 4వ అంతస్తు, చంద్ర టవర్స్, పాత అసిస్‌మెంట్ నెం. 24985టి / 15, కొత్త అసిస్‌మెంట్ నెం. 208761, డి.నెం. 32-09-16, పిన్నమనేని వారి వీధి, మొఘల్‌రాజపురం, విజయవాడ – 520010

నేచర్ ఆఫ్ లిమిట్	అమౌంట్ (రూ. లక్షల్లో)	ది. 26-06-2023 నాటికి బకాయి మొత్తము (రూ.)
Cash Credit Loan 329805010072024	Rs. 30,00,000/-	Rs. 31,94,360-71
Term Loan 329806130004604	Rs. 9,00,000/-	Rs. 8,89,507-80
	Total	Rs. 40,83,868-51

ప్రాథమిక హామీ : కృష్ణా జిల్లా, విజయవాడ, మొఘల్‌రాజపురం, పిన్నమనేని వారి వీధి, డి.నెం. 32-09-16, కొత్త అసిస్‌మెంట్ నెం. 208761, పాత అసిస్‌మెంట్ నెం. 24985టి/15 వద్ద శ్రీమతి ఇమ్మిడి శ్రావణి గారి పేరిట చంద్ర టవర్స్ నందు 4వ అంతస్తులోని ఫ్లాట్ నెం. 401.
అమ్మా / అయ్యా,
విషయం : ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ చట్టము ప్రకారము నోటీసు – మీరు మా నుండి పొందిన ఋణ సౌకర్యములకు సంబంధించి – నిరర్ధక ఆస్తులుగా వర్గీకరణ.
ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా మీరు **క్యాష్ క్రెడిట్ లోన్ మరియు టర్మ్ లోన్ ల క్రింద మా ఎనికేపాడు బ్రాంచి** వద్దనున్న మీ ఋణ బకాయిలను / వడ్డీని చెల్లించుటలో విఫలమైనందున మీ **ఖాతాను ది. 12-04-2023 న నిరర్ధక ఆస్తిగా (NPA)** వర్గీకరించ బడింది. ఎగువ తెలిపిన తేదిన మీ ఋణ ఖాతాల బకాయిలు మొత్తము పైన తెలుప బడినవి. అనేక మార్లు విన్నపములు చేసినప్పటికి, మీరు మీ ఖాతాలోని బకాయి మొత్తములను చెల్లించలేదు / మీ ఋణములను చెల్లించలేదు. అందువలన సెక్యూరిటైజేషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 యొక్క సెక్షన్ 13 (2) ప్రకారము మీ యొక్క బకాయి మరియు ఋణ పత్రములో అంగీకరించబడిన నియమ నిబంధనలలో ఉన్న ఒప్పందపు రేటు ప్రకారము పైన తెలుపబడిన బకాయి తేది తదుపరి నెలవారి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంకుకు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టం ప్రకారం లభించు ఏవేని లేదా అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.
1) మీరు సదరు బకాయిలను 60 రోజులలోగా తిరిగి చెల్లించుటలో విఫలమైనచో, బ్యాంకు వారు సదరు చట్టం ప్రకారం వారికి సంక్రమించిన అన్ని హక్కులను వినియోగించి హామీ ఇవ్వబడిన ఆస్తుల విక్రయ ధనముతో బకాయిలను పూర్తిగా చెల్లించబడనప్పుడు, మిగిలిన బకాయి సొమ్ము మీ నుండి రాబట్టుకొనుటకు, న్యాయస్థానము / డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ నందు తగు న్యాయపరమైన చర్యలు తీసుకోబడునని తెలియజేయడమైనది.
2) సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (13) ప్రకారము ఈ నోటీసు పొందిన అనంతరం మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంకు వారి అనుమతి లేకుండా విక్రయించరాదు. మరియు లావాదేవీలు జరుపరాదు సదరు సెక్షన్‌లో నిబంధనలలో ఏ విధమైన అతిక్రమణ జరిగిన తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.
SARFAESI చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువు లోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.
తేది : 26-06-2023
సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మీకోసం

నెయ్యి తాజాగా ఉండాలంటే అందులో చిన్న బెల్లం ముక్క వేయాలి.

జీవన సౌరభం

అత్తరు దుకాణానికి వెళ్తే అక్కడ మనమేమీ కొనకపోయినా కొంత పరిమళం మనకు అంటుకుంటుంది. ఉత్తముల సాహచర్యమూ అంతే..!

మంచి స్నేహితులు

ఒక గ్రామంలో చందు, చరణ్ అనే ఇద్దరు స్నేహితులు ఉన్నారు. వారివి పక్క పక్క ఇల్లు. వారు తొమ్మిదో తరగతి చదువుతున్నారు. చందు బాగా చదువుతాడు. కానీ, ఒక్క ఇంగ్లీష్ మాత్రం సరిగా చదవలేడు. అలాగే చరణ్‌కు లెక్కలు తప్ప మిగతా సబ్జెక్టులు వస్తాయి. ఆ సబ్జెక్టులు తమకు అర్థం కాకుండా ఉన్నాయనిచందు ఇంగ్లీష్‌ను, చరణ్ లెక్కలను చదవడం తగ్గించారు.

కొన్ని రోజుల తర్వాత ఎస్ఎ 1 పరీక్షలు జరిగాయి. ఆయా సబ్జెక్టుల్లో ఇద్దరికీ మార్కులు తక్కువ వచ్చాయి. అవి చూసి తోటి పిల్లలు వారిని ఎగతాళి చేశారు. 'మీరు మంచి మిత్రులు కదా. చదువు మాత్రం రాదు' అంటూ ఆట పట్టించారు. చందు, చరణ్ ఆ మాటలకు బాధపడి ఉపాధ్యాయుడి వద్దకు వెళ్లి జరిగిన విషయం చెప్పారు. అప్పుడు ఉపాధ్యాయుడు వారితో 'ఇతరులు మనల్ని ఎగతాళి చేశారని బాధపడకూడదు. మనల్ని తిట్టినవారే మెచ్చుకోవాలి అంటే మీరు బాగా చదవాలి.' అని చెప్పారు.

ఆ మాటలు చందు, చరణ్‌లపై ప్రభావం చూపాయి. తమకు రాని ఇంగ్లీష్, గణితం సబ్జెక్టులను ఉపాధ్యాయులు చెప్పేటపుడూ శ్రద్ధగా వినడం మొదలుపెట్టారు. ఇంటికి వెళ్ళాక చందుకు చరణ్ ఇంగ్లీష్ చెప్పేవాడు. చరణ్‌కి చందు లెక్కలు వివరించేవాడు. అలా ఒకరికి రాని సబ్జెక్టును మరొకరు వివరంగా అడిగి తెలుసుకోసాగారు.

ఆ తర్వాత కొన్ని రోజులకు జరిగిన ఎస్ఎ 2 పరీక్షలలో వారు తరగతిలో అందరికంటే ఎక్కువ మార్కులు తెచ్చుకున్నారు. దాంతో మిగతా పిల్లలందరూ చప్పట్లతో అభినందించారు. 'మీరు మంచి స్నేహితులు. పట్టుదలతో చదివి మంచి మార్కులు తెచ్చుకున్నారని మెచ్చుకున్నారు. అప్పుడు చరణ్, చందు చాలా సంతోషించారు.

- ఎం. రాం చరణ్,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నర్సింహుల పల్లి.

లెక్క తేల్చండి

చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

నేను గీసిన బొమ్మ

- వారాధి నిత్యానంద
మండల పరిషత్ ఉన్నత పాఠశాల,
అనగానిదొడ్డి గ్రామం,
గుత్తి మండలం,
అనంతపురం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వన్య ప్రాణులకు వైద్య సేవలు

మనిషికి కొద్దిగా నలతగా ఉంటే వెంటనే డాక్టర్ దగ్గరకు వెళ్లి మందులు తెచ్చుకుంటాడు. తాను పెంచుకునే జంతువులకూ పశువైద్యశాలకు తీసుకెళ్లి వైద్యం అందిస్తాడు. మరి అడవిలో ఉన్న జంతువుల పరిస్థితి ఏంటి?... అటువంటి మృగాలకు, విష పూరిత జీవులను ప్రమాదాల నుంచి రక్షించడం, దగ్గరకు వెళ్లి వైద్యం చేయడం ఓ పెద్ద సవాల్. అయినా మేఘన చాకచక్యంగా వన్య ప్రాణులను అపాయాల నుంచి కాపాడుతున్నారు. వెంటనే వైద్యం అందిస్తున్నారు. అవసరమైతే శస్త్రచికిత్స చేసి వాటి ప్రాణాలను కాపాడుతున్నారు.

అడవి జంతువులు మంచినీళ్ల కోసం, ఆహారం కోసం అడవిలో సంచరిస్తూ ఉంటాయి. ఒక్కోసారి రోడ్డు దాటి మరో ప్రదేశానికి తరలి వెళుతూ ఉంటాయి. ఈ క్రమంలో అవి ప్రమాదానికి గురవుతున్నాయి. లోతైన బావుల్లో పడటం, బురదలో కూరుకుపోవడం, గాయాలవడం జరుగుతున్నాయి. ఈ క్రమంలో కర్నాటకకు చెందిన డాక్టర్ మేఘనా పెమ్మయ్య వాటిని రక్షించి, వైద్యం చేస్తున్నారు. తిరిగి సురక్షితంగా అడవికి పంపిస్తున్నారు. సాధారణంగా పులుల గాండ్రింపు వింటేనే భయపడి పారిపోతారు. అలాంటిది ఆమె చిరుత పులులను పట్టుకుని వైద్యం అందించిన సందర్భాలు ఎన్నో. 32 ఏళ్ల మేఘనకు చిన్నప్పటి నుంచి జంతువులంటే ఇష్టం. ఆ ఆసక్తితో బెంగళూరులోని హెబ్బల్‌లోని వెటర్నరీ కళాశాల్లో సైన్సెస్ అండ్ వైల్డ్‌లైఫ్ మెడిసిన్ చదివారు. అందుకు తన కుటుంబం చాలా మద్దతు ఇచ్చింది. ఆమె తండ్రి, పోలీసు సూపరింటెండెంట్. ఆయన ప్రోత్సాహంతో మేఘన వన్యప్రాణుల రక్షించే డాక్టర్‌గా వృత్తి చేపట్టారు.

రెస్క్యూ ఆపరేషన్లతో...

మేఘన ఏడేళ్ల క్రితం ఈ బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ఎప్పుడైనా, ఎక్కడైనా చిరుత పులులు బావుల్లో పడ్డాయని, మంటల్లో చిక్కుకున్నాయని, రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాయని సమాచారం అందిన వెంటనే వెళతారు. ఎటువంటి పనినైనా పక్కనబెట్టి బృందంతో కలిసి పరుగుతీస్తారు. వందల సార్లు లోతైన బావిలో చిరుత పులులు పడ్డాయని సమాచారాలు వచ్చాయి. లోతు గురించి ఆలోచించకుండా బావుల్లోకి దిగి వాటిని రక్షిస్తుంది. ఒకసారి 20 అడుగుల బావిలో పడిన పులిని బయటకు తీసేందుకు సభ్యులు వెనకాడారు. మేఘనా ధైర్యంగా బావిలోకి దిగింది. పులిని ఎలాగైనా రక్షించాలన్న ఆలోచనతో బోను సహాయంతో బావిలోకి దిగింది. దానికి మత్తు ఎక్కిన తర్వాత పులిని పట్టుకుని బోనులోకి లాగింది. ఆ క్రమంలో గాయపడిన పులులు ఒక్కోసారి వీరిని చూసి బెదిరిపోయీ తిరిగి దాడి చేసే అవకాశమూ లేకపోలేదు. అయినా మేఘనా రెస్క్యూ సూట్ వేసుకుని ఆ జంతువుల దగ్గరకు వెళ్లి వాటిని కాపాడుతుంది. వాటిని వైద్యశాలకు తరలించి భద్రత కల్పిస్తుంది.

ఒకసారి కర్కాల సమీపంలోని ఒక గ్రామంలో అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన వలలో చిరుతపులి చిక్కుకుంది. ఆ వల పులిని కదలనివ్వకుండా ఛాతికి బిగుతుగా పట్టేసింది. దాంతో మెడపై చర్మం చీలి తీవ్రంగా రక్తస్రావం అయ్యింది. దాన్నీ కాపాడి శస్త్రచికిత్స చేసింది మేఘన. గత ఏడాది ఎనిమిది చిరుతపులిలను బావిలో నుంచి రక్షించింది.

కర్ణాటకకు ఇరుగుపొరుగున ఉన్న సుబ్రహ్మణ్య, కుద్రేముఖ్ అడవుల్లో ఉన్న పక్షులు, ముంగిసలు, నక్కలకు చికిత్స చేశారు. అలాగే వానలకు, వరదలకు బయటకు వచ్చిన పాములు బహిరంగ ప్రదేశాల్లో తిరుగుతున్నప్పుడు, గాయపడిన పాములను, జాకల పక్షులను, మనిషి చర్యల వల్ల దెబ్బతిన్న ఏనుగులను కాపాడి చికిత్స చేసింది. ఇంతటి ప్రమాదకరమైన వృత్తిలో రాణిస్తున్న మేఘనను అధికారులు, తోటి వైద్య సిబ్బంది. అభినందిస్తున్నారు. ఒక్కోసారి ఆ వన్యప్రాణులకు ఆపరేషన్ చేయాల్సి వచ్చినప్పుడు తన భర్త సహాయమూ తీసుకుటుంది. ఆయనా పశు వైద్యుడే. ఆయన కూడా మేఘనాను ఈ ఫీల్డ్‌లో వెన్నుతట్టి ప్రోత్సహించారు. అడవుల్లో వేగంగా పట్టణీకరణ జరగడం వల్లే జంతువులు బయటకు వస్తున్నాయి. దేశంలో సుమారు 7,400 చదరపు కిలోమీటర్ల అడవులను మనుషులు ఆక్రమించుకున్నారు. అది అర్థం చేసుకోకుండా జనం వాటిని హింసిస్తున్నారు. దీన్ని మానవ-జంతు సంఘర్షణగా ప్రత్యక్ష అనుభవాన్ని చూస్తున్నారు. వీటిపై మనుషులకు అవగాహన కల్పించటమే తన లక్ష్యమంటున్నారు మేఘన.



టమాటా తింటే కిడ్నీలో రాళ్లా?

చాలామంది ఇళ్లల్లో టమాటా లేకుండా ఏ వంట పూర్తికాదు. వంటకు రుచిని మాత్రమే కాకుండా, టమాటాలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు, సౌందర్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. అయితే చాలామంది టమాటా తింటే కిడ్నీలో రాళ్ల సమస్యలు వస్తాయని నమ్ముతారు. మరి నిజంగానే టమాటాలతో కిడ్నీలో రాళ్లు ఏర్పడతాయా?

- టమాటాలో విటమిన్ సి, విటమిన్ ఎ, పొటాషియం, ఫైబర్, ప్రోటీన్లు పుష్కలంగా ఉన్నాయి. ఈ రెడ్ సిట్రిక్ ఫ్రూట్ కంటిచూపుకు మేలు చేస్తుంది. డయాబెటిక్ సమస్యలను తగ్గిస్తుంది. సూర్యరశ్మి నుండి రక్షిస్తుంది. ప్రోస్టేట్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.
- కిడ్నీ స్టోన్స్‌లో చాలా రకాలు ఉన్నాయి. వాటిలో చాలా సాధారణమైనవి కాల్షియం స్టోన్స్. మన కిడ్నీలో కాల్షియం ఆక్సలేట్ అధికంగా చేరడం వల్ల ఈ రాళ్లు ఏర్పడతాయి. ఆక్సలేట్ అనేది వివిధ కూరగాయలు, పండ్లలో సహజంగా లభించే పదార్థం. మన కాలేయం రోజుకు కొంత మొత్తంలో కాల్షియంను ఉత్పత్తి చేస్తుంది. మన ఎముకలు, కండరాలు రక్తం నుండి కాల్షియంను గ్రహిస్తాయి. అయితే రక్తంలో ఈ పోషకం మొత్తం పెరిగినప్పుడు, అది మూత్రంలో విసర్జించబడటానికి మూత్రపిండాలకు వెళుతుంది.
- చాలా సార్లు మూత్రపిండాలు శరీరం నుండి అదనపు కాల్షియంను తొలగించలేవు. ఇది క్రమంగా పేరుకుపోతుంది. అదే రాళ్లుగా రూపాంతరం చెందుతుంది.
- టమాటాలో అధిక మొత్తంలో ఆక్సలేట్ ఉన్నందున టమాటాలు తింటే కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశం ఉందని భావిస్తారు. టమాటాలో ఆక్సలేట్ ఉంటుంది. కానీ, దాని పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది. ఇది మూత్రపిండాల్లో రాళ్లను కలిగించదు. 100 గ్రాముల టమాటాలో 5 గ్రాముల ఆక్సలేట్ మాత్రమే ఉంటుంది.
- ఆరోగ్యంగా ఉండి, కిడ్నీ సమస్య లేకుంటే, టమోటాలు తినడానికి భయపడనవసరం లేదు. కానీ, కిడ్నీ సంబంధిత సమస్య ఉంటే ఆక్సలేట్ సహిత ఆహారం పరిమితంగా తీసుకోవాలి.
- నిపుణుల అభిప్రాయం ప్రకారం, టమాటా మూత్రపిండాలకు హానికరం కాదు. దాని పోషక విలువ ఒక వ్యక్తి మొత్తం ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

టమాటాలను ఎవరు తినకూడదు?

- కిడ్నీలో రాళ్లతో బాధపడేవారు తినకూడదు.
- కీళ్ల నొప్పులతో బాధపడేవారు టమాటాలకు దూరంగా ఉండాలి.

'భోళా శంకర్' షూటింగ్ ముగిసింది!

చిరంజీవి నటిస్తున్న 'భోళా శంకర్' చిత్ర నిర్మాణం పూర్తయ్యింది. ఈ విషయాన్ని చిత్ర దర్శకుడు మెహర్ రమేష్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. సినిమా కోసం కష్టపడిన నటీనటులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపేందుకు ఆయన ఓ పోస్ట్ చేశారు. ప్రస్తుతం భోళా శంకర్ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందని, త్వరలోనే మ్యూజికల్ అప్ డేట్‌లను విడుదల చేస్తామని ఈ పోస్ట్‌లో పేర్కొన్నారు. తమన్నా కథానాయికగా మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం 2023 ఆగస్టు 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. కీర్తి సురేష్, సుశాంత్, రఘుబాబు, మురళీ శర్మ, రవిశంకర్, వెన్నెల కిషోర్, తులసి తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. మహతి స్వర సాగర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తోంది.

కాంబో రిపీట్

త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో అల్లు అర్జున్ కొత్త ప్రాజెక్ట్‌ను తాజాగా ప్రకటించారు. 'జులాయి', 'సన్ ఆఫ్ సత్యమూర్తి', 'అల వైకుంఠపురములో' వంటి చిత్రాల తరువాత అల్లు అర్జున్-త్రివిక్రమ్ మరోసారి జత కట్టారు. తమ నాలుగో చిత్రాన్ని ప్రకటిస్తూ మేకర్స్ యూట్యూబ్‌లో ఓ వీడియోను విడుదల చేశారు. టైటిల్, ఇతర వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్, గీతా ఆర్ట్స్ కలిసి ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మించనున్నాయి. థమన్ సంగీతం అందించబోతున్నారు.

6న 'సలార్' టీజర్

ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న 'సలార్' చిత్రంపై తాజా అప్డేట్ ఒకటి వచ్చింది. తాజాగా ఈ సినిమా టీజర్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. సలార్ టీజర్‌ను జులై 6న ఉదయం 5:12 నిమిషాలకు రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఓ స్పెషల్ పోస్టర్‌ను కూడా రిలీజ్ చేశారు.



'మావీరన్' ట్రైలర్ విడుదల

'మండేలా' వంటి ప్రయోగాత్మక సినిమాతో తమిళ ప్రేక్షకుల మన్నన పొందిన మడోన్ అశ్విన్ తెరకెక్కిస్తున్న 'మావీరన్' చిత్రం నుండి తాజాగా ట్రైలర్ విడుదలైంది. తెలుగులో ఈ సినిమా 'మహావీరుడు'గా రాబోతోంది. త్వరలో తెలుగు ట్రైలర్ విడుదల చేయనున్నారు. ఈ సినిమా జూలై 14న తమిళంతో పాటు తెలుగులోనూ విడుదల కానుంది. అత్యంత పిరికివాడైన ఓ కుర్రాడు.. తనకు ఎదురైన సంఘటనల వల్ల ధైర్యవంతుడిగా ఎలా మారాడు అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా తెరకెక్కినట్లు ట్రైలర్‌లో చూపించారు. డైరెక్టర్ మిస్కిన్ ఈ సినిమాలో విలన్ పాత్ర పోషించారు. సునీల్ కీలకపాత్రలో కనిపించనున్నారు. శంకర్ కూతురు అతిథి హీరోయిన్‌గా నటిస్తున్నారు. తమిళంతో పాటు తెలుగులోనూ ఈ సినిమాను పెద్ద ఎత్తున రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

ఆగస్టు 4న 'మిస్ అండ్ మిస్టర్ శెట్టి'

నవీన్ పోలిశెట్టి, అనుష్క శెట్టి కలిసి నటిస్తున్న 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సినిమా విడుదల తేదీని తాజాగా మేకర్స్ ప్రకటించారు. ఆగస్టు 4న ఈ సినిమాని రిలీజ్ చేస్తున్నట్లు తెలిపారు. యువీ క్రియేషన్స్ ప్రొడ్యూస్ చేస్తున్న ఈ మూవీలో నవీన్ స్టాండప్ కమెడియన్‌గా, అనుష్క చెఫ్‌గా నటిస్తున్నారు. పి.మహేష్ బాబు డైరెక్ట్ చేస్తున్నారు. ఆగస్టు రెండో వారంలో చిరంజీవి 'భోళా శంకర్', రజినీకాంత్ 'జైలర్' సినిమాతో ప్రేక్షకులని పలకరించనున్నారు. దీంతో ఈ రెండు సినిమాలకి వారం ముందే ఈ సినిమా రిలీజ్ చేయడానికి మేకర్స్ సిద్ధమైనట్లు తెలుస్తోంది.

'స్కంద'గా రామ్ వస్తున్నాడు



బోయపాటి శ్రీను, రామ్ కాంబోలో రాబోతోన్న సినిమా టైటిల్‌ని తాజాగా మేకర్స్ ప్రకటించారు. 'స్కంద' అనే టైటిల్‌తో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ టైటిల్‌ని రివీల్ చేస్తూ మేకర్స్ ఓ యాక్షన్ గ్లింప్స్‌ను కూడా విడుదల చేశారు. సెప్టెంబరు 15, 2023న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. సాయి మంజ్రేకర్ ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

హర్మన్‌ప్రీత్‌కు పగ్గాలు

బంగ్లా పర్యటనకు మహిళల జట్టును ప్రకటించిన బిసిసిఐ

ముంబయి: బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లే భారత మహిళలజట్టును భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) సోమవారం వెల్లడించింది. భారత మహిళలజట్టుకు కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్ వ్యవహరించనుండగా.. వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన ఎంపికైంది. అలాగే ప్రారంభ మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాణించిన యస్తికా భాటియా, రీచా ఘోష్ వికెట్ కీపర్లుగా ఎంపికయ్యారు. అస్సాంకు చెందిన ఉమా ఛెత్రీ అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేయనుంది. ఈ సిరీస్ జులై 9నుంచి టి20 సిరీస్.. జులై 16 నుంచి వన్డే సిరీస్ ప్రారంభం కానున్నాయి. జులై 22న జరిగే చివరి వన్డేతో బంగ్లాదేశ్‌లో భారతజట్టు పర్యటన ముగియనుంది. ఈ సిరీస్‌కు మీర్‌పూర్‌లోని షేర్-ఎ-బంగ్లా జాతీయ క్రికెట్ స్టేడియంలో మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ పర్యటనలో భాగంగా భారతజట్టు బంగ్లాదేశ్‌తో మూడు టి20లతోపాటు మరో మూడు వన్డేల

షెడ్యూల్..

జులై 9	తొలి టి20
జులై 11	రెండో టి20
జులై 13	మూడో టి20
జులై 16	తొలి వన్డే
జులై 19	రెండో వన్డే
జులై 22	మూడో వన్డే

వన్డే, టి20 జట్టు: హర్మన్ ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మృతి మంధాన(వైస్ కెప్టెన్, దీప్తి శర్మ, షెఫాలీ వర్మ, జెమిమా రోడ్రిగ్స్, యస్తికా భాటియా, ఉమా ఛెత్రి(వికెట్ కీపర్లు), హర్లీన్ డియోల్, దేవిక వైద్య, అమన్‌జ్యోత్ కౌర్, మేఘన, పూజ వస్త్రాకర్, మేఘ్న సింగ్, అంజలి శర్వాని, మోనిక పటేల్, రషి కనోజియా, అనూష బరెడ్డి, మిన్నూ మణి(టి20లకు), స్నేహ్ రాణా(వన్డేలకు).

సీడెడ్ల శుభారంభం

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సీడెడ్ ఆటగాళ్లు శుభారంభం చేశారు. సోమవారం నుంచి ప్రారంభమైన వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ తొలిరౌండ్ పోటీ మహిళల సింగిల్స్‌లో టాప్‌సీడ్ ఇగా స్వైటెక్, పురుషుల సింగిల్స్‌లో 2వ సీడ్, నొవాక్ జకోవిచ్ శుభారంభం చేశారు. స్వైటెక్ 6-1, 6-3తో చైనాకు చెందిన జూ-లిన్‌పై సునాయాసంగా గెలుపొందగా.. జకోవిచ్ 6-3, 6-32, 7-6(7-4)తో అర్జెంటీనాకు చెందిన పెడ్రో కాకిన్‌పై గెలిచాడు. ఇతర పోటీల్లో అజరెంకా(బెలారస్) 6-4, 5-7, 6-4తో యువా న్(అమెరికా)పై, నదియా పొడొరొస్కోవా (అర్జెంటీనా) 3-6, 7-697-5), 6-4తో మటిన్కోవా (చెక్)పై, పెర్రీ(ఫ్రాన్స్) 6-7(4-7), 6-0, 6-4తో

డార్క్(ఇంగ్లండ్)పై నెగ్గి రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లారు. పురుషుల సింగిల్స్‌లో 7వ సీడ్, రష్యాకు చెందిన ఆండ్రీ రుబ్లేవ్ శుభారంభం చేశాడు. తొలిరౌండ్‌లో రుబ్లేవ్ 6-3, 7-5, 6-4తో ఆస్ట్రేలియాకు చెందిన మాక్స్ పర్సెల్‌పై వరుససెట్లలో నెగ్గాడు.

లియాన్ స్థానంలో మర్ఫీ

సిడ్నీ: ఆస్ట్రేలియా జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ స్పిన్నర్ నాథన్ లియాన్ గాయం కారణంగా యాషెస్ సిరీస్ మిగిలిన టెస్టులకు దూరమయ్యాడు. గాయపడ్డ లియాన్ స్థానంలో మర్ఫీకి చోటు కల్పిస్తున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా(సిఏ) సోమ వారం ఓ ప్రకటనలో తెలిపింది. భారత్‌తో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అరంగేట్రం చేసిన మర్ఫీ.. అరంగేట్రం టెస్ట్‌లోనే ఐదు వికెట్లతో సత్తా చాటాడు. ఆసీస్ తరపున వందో టెస్టు ఆడుతున్న లియాన్ లార్డ్స్ టెస్టులో రెండో రోజు ఫీల్డింగ్ చేస్తుండగా గాయపడ్డాడు. కుడి కాలికి దెబ్బ తగలడంతో మైదానం వీడిన అత ను మూడో రోజు బౌలింగ్ చేయలేదు. స్కానిం గ్ అనంతరం చేతి కర్రల సాయంతో నడుస్తూ కనిపించాడు. ఇక ఐదు టెస్ట్‌ల యాషెస్ సిరీస్ లో ఆస్ట్రేలియా జట్టు 2-0 ఆధిక్యంలో ఉంది.

జోరుమీదున్న ఛెత్రీ సేన..

నేడు భారత్-కువైట్ జట్ల మధ్య ఫైనల్ పోరు శాఫ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్

బెంగళూరు: 9వ శాఫ్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో అప్రతిహత విజయాలతో ఫైనల్లోకి దూసుకొచ్చిన ఛెత్రీ సేన ఈ మ్యాచ్‌లో గెలిస్తే 6వ సారి టైటిల్‌ను ముద్దాడనుంది. బెంగళూరులోని శ్రీ కంఠీరవ స్టేడియంలో భారత్-కువైట్ జట్ల మధ్య మంగళవారం టైటిల్ పోరు జరగనుంది. సెమీఫైనల్లో భారతజట్టు పెనాల్టీ షూటౌట్‌లో 4-2గోల్స్ తేడాతో పటిష్ట లెబనాన్‌ను, కువైట్ జట్టు 1-0తో బంగ్లాదేశ్‌ను ఓడించి ఫైనల్లోకి దూసుకొచ్చాయి. లీగ్ దశలో భారత్-కువైట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 1-1తో డ్రా అయ్యింది. ఇదే గ్రూప్‌లో ఉన్న నేపాల్, పాకిస్తాన్‌పై గెలిచిన ఛెత్రీ సేన.. కువైట్ మ్యాచ్‌ను డ్రా చేసుకొని 7పాయింట్లతో కువైట్‌తో సమానంగా నిలిచింది. అయినా ఒక గోల్ అంతరంతో కువైట్ జట్టు ఆ గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలువగా.. భారతజట్టు రెండోస్థానం లో నిలిచి లెబనాన్‌తో సెమీస్ పోటీపడింది. ఇక కువైట్‌తో ఇప్పటివరకు రెండుసార్లు తలపడ్డ భారతజట్టు 0-1తో వెనుకబడి ఉంది. మరో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. భారత్-లెబనాన్ జట్ల మధ్య జరిగిన సెమీస్ మ్యాచ్‌ను వీక్షించేందుకు సుమారు 20వేలమంది ప్రేక్షకులు హాజరయ్యారు. 2005, 09, 11, 15, 21లో టైటిళ్లు నెగ్గిన భారత్.. 2008, 13, 18లో రన్నరప్‌గా నిలిచింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68